www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 242 | మంగళవారం | 18 ఫిబ్రవరి, 2025

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

## కేసీఆర్ తెలంగాణ జాతికే హీరో

- తండ్రి జన్మదినోత్సవ కార్యక్రమంలో కేటీఆర్
- తెలంగాణ, ఏపీ సీఎంలు సహా పలువురి శుభాకాంక్షలు



"మా నాన్న కేసీఆర్ నాకు ఒక్కడికే కాదు. మొత్తం తెలంగాణ జాతికే హీరో. సమైక్య దోపిడీ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించిన కారణజన్ముడు కేసీఆర్. ఆయన కుమారుడిగా పుట్టడం నా పూర్వజన్మ సుకృతం" అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

**ప్రజానావ, హైదరాబాద్:** మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేతృత్వంలో సోమవారం తెలంగాణ భవన్‌లో భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించగా కేటీఆర్ భావోద్వేగంతో ప్రసంగించారు. మరోవైపు ఎర్రవల్లి నివాసంలో ఉన్న కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు భారాస నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. కేసీఆర్‌కు తెలుగు రాష్ట్రాల సీఎంలు సహా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

మిగతా 2 లో

## రేవంత్ తీరుతో కాంగ్రెస్ సర్కారు ఉంటుందో, పోతుందో..

### కేంద్ర మంత్రి బండి సంజయ్



**ప్రజానావ, కరీంనగర్:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారం చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో.. పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోని భాజపా మండలాధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 4 లో



## సాగు, తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

- నీటిపారుదలశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- టెలిమెట్రీల ఏర్పాటుతో కృష్ణా జలాల అక్రమ తరలింపును అడ్డుకోవాలని ఆదేశం

### రానున్న 3 నెలలు కీలకం.. సమర్థంగా పనిచేయాలి

**ప్రజానావ, హైదరాబాద్ :** రాష్ట్రంలో రాబోయే మూడు నెలలు అత్యంత కీలకమని, రాష్ట్రమంతటా అన్ని ప్రాంతాల్లో సాగు, తాగు నీరు, విద్యుత్తు అవసరాలు గణనీయంగా పెరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని, సాగు, తాగు అవసరాలకు ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సోమవారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల కింద సాగవుతున్న పంటలకు ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేయాలని సీఎం సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితులకు అనుగుణంగా పరిష్కార మార్గాలు అనుసరించాలని ఆదేశించారు.

మిగతా 2 లో

## కోడ్ లేని జిల్లాల్లో రేషన్‌కార్డులివ్వండి

అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



## సేద్యంలోనే కోటిన్నర మందికి ఉపాధి

రాష్ట్ర ప్రజల తలసరి వార్షిక ఆదాయం రూ.3.56 లక్షలు

రాష్ట్ర గణాంకాల నివేదిక-2024లో వెల్లడి



**ప్రజానావ, హైదరాబాద్ :** వ్యవసాయ రంగమే రాష్ట్ర ప్రజలకు జీవనాడిగా ఉంది. రాష్ట్ర ప్రజల్లో అత్యధిక శాతం మందికి సేద్యమే ఉపాధి కల్పిస్తోంది. కోటిన్నర మంది వ్యవసాయంలోనే ఉపాధి పొందుతున్నారని 'రాష్ట్ర గణాంకాల నివేదిక-2024'లో అర్థ, గణాంకశాఖ వెల్లడించింది. 2023-24లో రూ.40.44 లక్షల కోట్ల స్థూల రాష్ట్ర జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ)తో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలవగా.. రూ.15.01 లక్ష ల కోట్లతో తెలంగాణ 7వ స్థానంలో ఉంది. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సోమవారం సచివాలయంలో నివేదికను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్థికశా ఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, ప్రణాళికాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, డైరెక్టర్ షేక్ మీరా, డిప్యూటీ సీఎం కార్యదర్శి కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

మిగతా 2 లో

## నిధులెలా చెల్లించారు?

### సంప్రదింపులు ఎవరు జరిపారు?

- ఎఫ్‌ఈవో ప్రతినిధులను విచారించిన ఏసీబీ అధికారులు
- మళ్లీ తెరపైకి ఫార్ములా-ఈ రేసు
- నిబంధనల ఉల్లంఘన గురించి తెలియదన్న సంస్థ ప్రతినిధులు



## పెద్దగట్టు జనసంద్రం



**ప్రజానావ, సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు జాతరకు భక్తులు పోటెత్తారు. రెండో రోజు సోమవారం వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తజనంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న ఈ జాతర పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్రవాహనాల్లో గట్టు చెంతకు చేరుకున్న భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.



02



## బయోమెట్రిక్‌తో నకిలీ ఓటర్ల గుర్తింపు

- ఎక్కడి నుంచైనా ఓటుపై ఏకాభిప్రాయం అవసరం
- ప్రవాసుల రిమోట్ ఓటింగ్‌కు సమయమిదే
- సీఈసీ రాజీవ్ కుమార్ వ్యాఖ్యలు
- నేడు పదవీ విరమణ

03

ఎన్నికల సంఘం సారథిగా

## జ్ఞానేశ్ కుమార్

- ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి
- ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ సిఫార్సు
- రాష్ట్రపతి ఆమోదం

03



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



## మల్లన్న పట్నాలకు వికాస్ హాజరు



**ప్రజానావ, వేములవాడ :** వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న పట్నాలకు బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ చెన్నామనేని వికాస్ హాజరై, ప్రత్యేక పూజలుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్, అంజన్న యాదవ్, సంతోష్ యాదవ్, గుండెకర్ల లక్ష్మణ్, సంజీవ్ రెడ్డి, నర్సింగోజు శంకర్, ముడికే రాములు, ముడికే శ్రీనివాస్, ముదం శ్రీనివాస్, బొల్లు తిరుపతి యాదవ్, నాంపల్లి అరవింద్, పోచంపల్లి శ్రీకాంత్, గంట మహేష్, గడ్డి ప్రశాంత్ యాదవ్, యాదవ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు



# నిధులెలా చెల్లించారు?

## సంప్రదింపులు ఎవరు జరిపారు?

- ఎఫ్ఈవో ప్రతినిధులను విచారించిన ఏసీబీ అధికారులు
- మళ్లీ తెరపైకి ఫార్ములా-ఈ రేసు
- నిబంధనల ఉల్లంఘన గురించి తెలియదన్న సంస్థ ప్రతినిధులు

**ప్రజానావ, హైదరాబాద్:** కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్న ఫార్ములా–ఈ రేసు వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. లండన్‌లో ఉన్న ఫార్ములా–ఈ ఆపరేషన్స్(ఎఫ్ఈవో) ప్రతినిధులను ఏసీబీ అధికారులు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించారు. రేసు నిర్వహణ, అప్పటి రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం, నిధుల చెల్లింపు వంటి అంశాలపై ప్రశ్నించారు. ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి ఆధ్వర్యంలో ఎస్పీ రితిరాజ్, దర్యాప్తు అధికారి మాజీద్‌ఖాన్ విచారణలో పాల్గొన్నారు. ఈ విచారణకు ఎఫ్ఈవో సీఈవో హాజరు కావాల్సి ఉన్నా ఆయన తరఫున సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### అనుమతుల్లేకుండా రూ.55 కోట్ల చెల్లింపుపై..

ఎలాంటి అనుమతులు లేకుండానే విదేశీ సంస్థ అయిన ఎఫ్ఈవో సంస్థకు అప్పటి భారాస ప్రభుత్వం దాదాపు రూ.55కోట్లు చెల్లించిందన్న ఆరోపణలపై ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో నిధుల మళ్లింపు, ఫెమా ఉల్లంఘనలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తు జరుపుతున్నాయి. అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను సుమారు నెల రోజుల క్రితమే దర్యాప్తు సంస్థలు విచారించి, వాంగ్మూలాలు నమోదు చేశాయి. స్పాన్సర్‌షిప్ నుంచి తప్పుకొన్న గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులనూ విచారించాయి. ఇప్పుడు ఎఫ్ఈవో ప్రతినిధులను ఏసీబీ అధికారులు విచారించారు.

### 'నిబంధనల ఉల్లంఘన గురించి తెలియదు'

కేసు దర్యాప్తులో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరు కావాలంటూ ఎఫ్ఈవో సీఈవోకు ఏసీబీ అధికారులు నెల రోజుల క్రితమే ఈమెయిల్ పంపారు. కానీ, విచారణకు తాను హాజరు కాలేనని.. తన తరఫున సంస్థ ప్రతినిధులు హాజరవుతారని ఆయన సమాధానమిచ్చారు. ఈ మేరకు సోమవారం విచారణ చేపట్టగా.. సంస్థ ప్రతినిధులు లండన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. రేసు నిర్వహణకు సంబంధించి ఎవరు సంప్రదింపులు జరిపారు? నిధుల చెల్లింపు ఎలా జరిగింది అన్న కోణంలోనే ఎఫ్ఈవో ప్రతినిధులను ఏసీబీ అధికారులు విచారించినట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం తరఫున అర్వింద్‌కుమార్ తమతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారని, ఇదంతా ఈమెయిల్స్ ద్వారానే జరిగిందని సంస్థ ప్రతినిధులు చెప్పినట్లు తెలుస్తోంది. ఒప్పందంలో భాగంగానే తమ ఖాతాకు నిధులు బదిలీ చేశారని, నిబంధనల ఉల్లంఘనల గురించి తమకు సమాచారం లేదని వారు చెప్పినట్లు సమాచారం. ఒప్పందంలో పేర్కొన్న అంశాలను పూర్తి చేయకపోవడం వల్లే రేస్ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని తెలిపినట్లు తెలుస్తోంది. మొదటి రేసుకు స్పాన్సర్‌గా ఉన్న గ్రీన్‌కోకు చెందిన ఏస్ నెక్స్ట్‌జెన్ రెండో రేసు నుంచి అకస్మాత్తుగా తప్పుకోవడంపై ఏసీబీ అధికారులు ప్రశ్నించగా.. దీనిపై తమకు సమాచారం లేదని ఎఫ్ఈవో ప్రతినిధులు బదులిచ్చినట్లు సమాచారం.

# ఖతర్ పాలకుడికి అరుదైన గౌరవం

## విమానాశ్రయానికి వెళ్లి స్వాగతం పలికిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు ఖతర్ పాలకుడు (అమీర్) షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థాని రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం సోమవారం భారత్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. ప్రధానమంత్రి మోదీ స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి స్వాగతం పలికారు. "నా సోదరుడు, ఖతర్ దేశ పాలకుడు అయిన షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీకి స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. ఆయన భారత పర్యటన సఫలం కావాలని కోరుకుంటున్నాను" అని మోదీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. షేక్ తమీమ్ 2015 మార్చిలో భారత్‌లో పర్యటించారని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది.



# సాగు, తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు ఇబ్బంది లేకుండా సాగు, తాగునీరు అందించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని సీఎం సూచించారు. నాగార్జునసాగర్, శ్రీరామసాగర్ ప్రాజెక్టుల కింద సాగయ్యే పంటలు, నీటి విడుదలపై ఆయా జిల్లాల కలెక్టర్లు.. నీటిపారుదలశాఖ ఇంజినీర్లతో వెంటనే సమీక్షలు నిర్వహించాలని నిర్దేశించారు. ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు సాగునీటి విడుదల తీరును కలెక్టర్లు స్వయంగా పరిశీలించాలని పేర్కొన్నారు. కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, తగిన ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### వెంటనే టెలిమెట్రీల ఏర్పాటు..

శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి కృష్ణా జలాలను వినియోగించుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. నిర్ణీత కోటా కంటే ఎక్కువ నీటిని ఆంధ్రప్రదేశ్ తరలించకుండా అడ్డుకట్ట వేసేందుకు కృష్ణా పరీవాహకంలో టెలిమెట్రీ వ్యవస్థ ఏర్పాటే పరిష్కారమని సీఎం స్పష్టం చేశారు. ఆ పరికరాల ఏర్పాటుకు అయ్యే ఖర్చులో సగం నిధులను చెల్లించేందుకు ఏపీ ప్రభుత్వం ముందుకు రావటం లేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. టెలిమెట్రీ విధానం అమలుకు అవసరమైన నిధులన్నీ ముందుగా మన ప్రభుత్వమే చెల్లిస్తుందని, వెంటనే ఆ వ్యవస్థ అమలు కోసం కృష్ణా బోర్డుకు లేఖ రాయాలని సీఎం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాను ఆదేశించారు. నదీ జలాల్లో వాటాల పంపిణీ, వినియోగాన్ని లెక్కించే బాధ్యత కేంద్ర జలసంఘంపైనే ఉందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నిర్ణీత వాటా కన్నా ఏపీ ఎక్కువ నీటిని తరలించకుండా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఏకపక్షంగా నీటి తరలింపుపై వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

# కోడ్ లేని జిల్లాల్లో రేషన్‌కార్డులివ్వండి

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి వెంటనే ఏర్పాట్లు చేయాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో మొదట పంపిణీ ప్రారంభించి.. కోడ్ ముగిశాక మిగిలిన జిల్లాల్లోనూ చేపట్టాలన్నారు. సీఎం సోమవారం తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులకు అవకాశమిచ్చినా, మీ సేవా కేంద్రాల వద్ద రేషన్ కార్డుల కోసం ఎందుకు రద్దీ ఉంటోందని సీఎం ప్రశ్నించారు. దరఖాస్తు చేసిన కుటుంబాలే మళ్లీ మళ్లీ చేస్తుండడమే దీనికి కారణమని అధికారులు వివరణ ఇచ్చారు. వెంటనే కార్డులిస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని, వేగంగా జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. కొత్త కార్డులకు జారీకి పలు డిజైన్లను పరిశీలిం చారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని గనుల శాఖను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇసుక రీచ్‌లను జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు తరచూ తనిఖీ చేయాలన్నారు. రీచ్‌ల వద్ద అక్రమ రవాణాపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

### ఇసుక అక్రమ రవాణాపై కేసులు పెడతాం

ఇసుక రీచ్‌ల నుంచి జిల్లా రహదారులకు వచ్చే మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు దాడులు నిర్వహిస్తామని మైనింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ పేర్కొన్నారు. ఇసుక అక్రమాల నివారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చిన నేపథ్యంలో మైనింగ్ శాఖ డైరెక్టర్ శశాంక, టీజీఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్‌లతో కలిసి శ్రీధర్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... 'ఇసుక గుత్తేదారులతో సమావేశం ఏర్పాటు చేసి.. ఓవర్‌లోడ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం. తప్పులు జరిగితే ఆ గుత్తేదారు సంస్థను బ్లాక్‌లిస్టులో పెడతాం. నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇసుకను 24 గంటలూ బుకింగ్ చేసుకోవచ్చు. సరఫరా చేసే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అమర్చుతాం. 45 రోజుల్లో అక్రమాలన్నిటినీ అదుపు చేస్తాం. ఇసుక సరఫరా అక్రమాలపై 98480 94373, 70939 14343 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. వీడియో తీసి ఆధారాలను పంపించవచ్చు' అని పేర్కొన్నారు.

# సేద్యంలోనే కోటిన్నర మందికి ఉపాధి

(మొదటిపేజీ తరువాయి)

### నివేదికలోని ముఖ్యాంశాలు..

- తెలంగాణ జీఎస్‌డీపీలో రియల్ ఎస్టేట్, ఐటీ, వృత్తి సేవల రంగం వాటా 24.4 శాతం ఉండగా.. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, గనులు కలిపి 17.6%, వాణిజ్య, హోటళ్ల రంగం వాటా 19.9%, ఉత్పత్తి రంగం 8.9%, నిర్మాణ రంగం 5.2%, రవాణా, సమాచార రంగం 7%, ఆర్థిక సేవలు 4.8%, ఇతర రంగాలు మిగిలిన వాటా కలిగిఉన్నాయి.
- జీఎస్‌డీపీలో రియల్ ఎస్టేట్, ఐటీ, వృత్తి సేవల రంగం 24.4 శాతంతో మొదటి ర్యాంకులో ఉన్నా.. 51 శాతం మందికి ఉపాధి కల్పిస్తూ వ్యవసాయమే అగ్రస్థానంలో నిలిచింది. ఐటీ, వృత్తిసేవల రంగంలో 4% మంది, ఉత్పత్తిలో 12,వాణిజ్య, హోటళ్ల రంగంలో 10% మంది, మిగిలినవారు ఇతర రంగాల్లో ఉపాధి పొందుతున్నారు.
- 2023–24లో రాష్ట్ర ప్రజల తలసరి వార్షిక ఆదాయం(పీసీఐ)లో రూ.5.87 లక్షలతో సిక్కిం, రూ.4.61 లక్షలతో దిల్లీ, రూ.3.56 లక్షలతో తెలంగాణ వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. జాతీయస్థాయిలో పీసీఐ రూ.1.84 లక్షలుగా ఉంది.
- 2018–23 మధ్య వరుసగా ఐదేళ్లలో తలసరి ఆదాయంలో నమోదైన 'సగటు వార్షిక వృద్ధి రేటు' జాతీయస్థాయిలో 12.04 శాతం ఉండగా.. తెలంగాణ 12.03 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. ఒడిశా (11.02%), కర్ణాటక (10.59%), మధ్యప్రదేశ్(10.13%)తో వరుసగా 2, 3, 4 స్థానాల్లో ఉన్నాయి. ఈ 4 రాష్ట్రాలు తప్ప.. మరే ఇతర రాష్ట్రంలోనూ రెండంకెల వృద్ధి రేటు నమోదు కాలేదు. ఈ ఐదేళ్ల కాలవ్యవధిలో తెలంగాణలో 2022–23లో అత్యధికంగా 16.18% వృద్ధిరేటు నమోదైంది.

### జిల్లాల్లో రంగారెడ్డి ప్రథమం.. వికారాబాద్ చిట్టచివర..

జిల్లాలవారీగా వార్షిక తలసరి ఆదాయంలో రంగారెడ్డి రూ.9.54 లక్షలు, హైదరాబాద్ రూ.4.97 లక్షలు, సంగారెడ్డి రూ.3.21 లక్షలతో వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉండగా.. రూ.1.83 లక్షలతో వికారాబాద్ చిట్టచివరన అంటే 33వ స్థానంలో నిలిచింది.
స్థూల జిల్లా జాతీయోత్పత్తి(జీడీడీపీ)లో 2022–23లో రంగారెడ్డి రూ.2.85 లక్షల కోట్లతో, హైదరాబాద్ రూ.2.30 లక్షల కోట్లతో, మేడ్చల్ మల్కాజిగిరి రూ.88,940 కోట్లతో తొలి మూడు స్థానాల్లో ఉండగా, రూ.7,583 కోట్లతో ములుగుజిల్లా 33వ స్థానంలో నిలిచింది.

### అక్షరాస్యత 66.5 శాతం

- 2011 జనగణన ప్రకారం రాష్ట్ర జనాభా 3.50 కోట్లు కాగా.. 2026 నాటికి 3.86 కోట్లు దాటుతుందని అంచనా. ప్రతి వెయ్యి మంది బాలురకు 988 మంది బాలికలున్నారు. రాష్ట్ర అక్షరాస్యత శాతం 66.5. రాష్ట్రంలో మొత్తం 40,975 పాఠశాలలున్నాయి. 2023–24లో మధ్యలో చదువు మానేసిన విద్యార్థుల(డ్రాపౌట్లు) సంఖ్య ఉన్నత పాఠశాల స్థాయిలో 11.95 శాతం.
- 2023–24లో రాష్ట్రంలో 207.93 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయ్యాయి.
- పరిశ్రమల రంగంలో జాతీయ పారిశ్రామిక స్థూల విలువలో తెలంగాణ 3.37% వాటా కలిగిఉంది. దేశంలో ఉన్న మొత్తం పరిశ్రమల్లో 5.16 శాతంతో తెలంగాణలో 8వ స్థానంలో ఉంది.
- ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాలకు 2024 మార్చి 31 నాటికి రూ.1,163.08 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. మహాలక్ష్మి పథకం కింద 39.57 లక్షల మందికి రాయితీపై గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. గత ఆగస్టు ఆఖరు నాటికి పేదల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు సరఫరాకు రూ.808.33 కోట్లను ప్రభుత్వం చెల్లించింది.



## 'మత్స్య-6000' జలాంతర్గామి విజయవంతం

**చెన్నై :** లోతైన సముద్రంలో పరిశోధనలు చేసేందుకు రూపొందించిన జలాంతర్గామి 'మత్స్య–6000' ప్రయోగం విజయవంతమైంది. ఈ మేరకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. సముద్రయాన్ ప్రాజెక్టులో భాగంగా నాలుగో తరం జలాంతర్గామిని అభివృద్ధి చేసే పనిని ఎన్ఐఓటీకి కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ అప్పగించింది. దీంతో ఆ సంస్థ 'మత్స్య–6000' పేరుతో జలాంతర్గామిని తయారు చేసింది. ఇందులో 2.1 మీటర్ల వ్యాసం కలిగిన గోళాకారంలో ముగ్గురు వ్యక్తులు కూర్చొని ప్రయాణించేలా ఏర్పాట్లు చేసింది. దీని ఉప వ్యవస్థలను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసింది. ఈ జలాంతర్గామిని జనవరి 27 నుంచి ఫిబ్రవరి 12 వరకు చెన్నై సమీపంలోని కాట్టుపల్లి పోర్ట్‌లో ఉన్న ఎల్అండ్‌టీ షిప్ బిల్డింగ్ ఫెసిలిటీలో 500 మీటర్ల లోతులో పరీక్షించి, విజయంతమైందని ప్రకటించారు.

## పెద్దగట్టు జనసంద్రం

లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం హక్కుదారులుగా ఉన్న మెంతబోయిన, మున్న యాదవ వంశస్థులు ఆచారం ప్రకారం జాగిలాల బండ మీద నైవేద్యం ఉంచి ఆరగించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతరకు అధిక సంఖ్యలో వాహనాలు తరలిరావడంతో జాతీయ రహదారిపై, జాతర ప్రాంతంలోనూ రద్దీ ఏర్పడింది.





# కేసీఆర్ తెలంగాణ జాతికే హీరో



(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ 71వ జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణభవన్‌లో 71 కిలోల భారీ కేకును కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర నాయకులు కట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణలో ఏ మూలకు వెళ్లినా.. తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్న స్వరాలు వినిపిస్తున్నాయి. అదే లక్ష్యంతో.. 60 లక్షల మంది గులాబీ దండు పనిచేయడమే ఆయనకు ఇచ్చే పుట్టినరోజు కానుక' అని పేర్కొన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'కేసీఆర్ జన్మదినమంటే.. రాష్ట్ర ప్రజలందరికీ పర్వదినం. కేసీఆర్ అంటే ఒక వ్యక్తి కాదు.. నాలుగు కోట్ల ప్రజల భావోద్వేగం. మొండి ధైర్యంతో పోరాడి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారు. భవిష్యత్‌లో మరో మూడు పర్యాయాలు గెలవడానికి మొన్నటి ఓటమి నాంది కాబోతోంది' అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మధుసూదనా చారి, శ్రీనివాస్ గౌడ్, సత్యవతిరాథోడ్, రవిచంద్ర, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, గిరిజన మహిళల నృత్యాలతో కార్యకర్తలు సందడి చేశారు. తమ అధినేత తెలంగాణ ఉద్యమం, పదేళ్ల పాలనలో పురోగతిపై ఫొటోలు, వీడియోల ప్రదర్శనను అందరూ ఆసక్తిగా తిలకించారు.

### ఎర్రవల్లిలో సందడి

ఎర్రవల్లిలో కేసీఆర్‌ను స్వయంగా కలిసేందుకు నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలిరావడంతో సందడి నెలకొంది. వచ్చిన నాయకులను కేసీఆర్ పేరుపేరునా పలకరిస్తూ.. వారితో ఫొటోలు దిగారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దంపతులు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, పార్టీ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు కేసీఆర్‌ను కలిసి.. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపగా.. వారిని ఆయన ఆశీర్వదించారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలంగాణ చరిత్రకు సంబంధించిన ఫొటో ఆల్బమ్‌ను కేసీఆర్‌కు బహూకరించారు. జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపుమేరకు భారాస నాయకులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో వృక్షార్చన పేరిట భారీగా మొక్కలు నాటారు.

### రేవంత్‌రెడ్డి, చంద్రబాబుల శుభాకాంక్షలు

'నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ.. రాష్ట్రాభివృద్ధికి పాటుపడడంలో భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలి" అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌కు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు కూడా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### ఉజ్వల చరిత్రను చెరిపేయలేరు

తెలంగాణ పునర్నిర్మాణంలో నీళ్లు, నిధులు, నియామకాలకు సంబంధించి బలమైన పునాదులు వేయగలిగామని, అదే ప్రగతిని ఆర్‌బీఐ తన నివేదికలో వివరించిందని కేసీఆర్ అన్నారు. జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన 'వందేళ్ల ముందుచూపు' పుస్తకాన్ని సోమవారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్ ఆవిష్కరించారు. ఆ పుస్తకాన్ని గౌరీశంకర్ ఆయనకు బహూకరించారు. కేసీఆర్ మాట్లాడుతూ.. 'చితికిపోయిన తెలంగాణ పల్లెను తిరిగి చిగురించేట్లు చేసుకోగలిగాం. ఎగువ భూములకూ నీళ్లందించాం. చెరువుల్లో పూడిక తీయించి, ఎండాకాలంలో కూడా మత్తళ్లు దూకేటట్లు చేసి చూపించాం. అబద్ధాలు ఎప్పటికీ నిజాలు కావు. తెలంగాణ ఉజ్వల చరిత్రను ఎవ్వరూ చెరిపేయలేరు. తెలంగాణను పునర్నిర్మించిన ఘనత కచ్చితంగా భారాసదే' అని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

## బయోమెట్రిక్‌తో నకిలీ ఓటర్ల గుర్తింపు

- సీఈసీ రాజీవ్ కుమార్ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** పోలింగ్ స్టేషన్లవారీ ఓటింగ్ ప్రక్రియలో గోప్యతను కాపాడటానికి కొన్ని బూత్‌లలోని ఓట్లను కలిపి లెక్కించే వ్యవస్థ అవసరమని, ప్రవాస భారతీయులు తాముున్న ప్రదేశాల నుంచే ఓటింగ్‌లో పాల్గొనే సాధికారత కల్పించేందుకు సరైన సమయమిదేనని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. కోట్ల మంది వలస కార్మికులు ఎక్కడి నుంచైనా తమ ఓటు హక్కును వినియోగించుకునే విషయంలో ఏకాభిప్రాయం అవసరమని స్పష్టం చేశారు. నకిలీ ఓటర్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలింగ్ బూత్‌లలో బయోమెట్రిక్ నిర్ధారణను అమల్లోకి తేవాలని సూచించారు. మంగళవారం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో సోమవారం దిల్లీలో తనకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల వ్యయాలకు సంబంధించిన వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రారంభమైందని, దానిని తప్పనిసరి చేయాలని రాజీవ్ కుమార్ సూచించారు. దీనివల్ల పారదర్శకతతోపాటు విశ్లేషణకు అవకాశం కలుగుతుందని వెల్లడించారు. నియంత్రణలేని సోషల్ మీడియా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నికలకు ప్రమాదంగా మారిందని, దానిని ఎదుర్కొనే చర్యలను సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని అభిప్రాయపడ్డారు.

## ఎన్నికల సంఘం సారథిగా జ్ఞానేశ్ కుమార్

- ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి
- ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ సిఫార్సు
- రాష్ట్రపతి ఆమోదం



**న్యూఢిల్లీ:** భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేశ్ కుమార్, ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి రెండు గెజిట్ నోటిఫికేషన్లు వేర్వేరుగా విడుదలయ్యాయి. అంతకుముందు ప్రధాని మోదీ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ (ఈసీ) పదవిని చేపట్టబోయే వ్యక్తుల పేర్లను ఖరారు చేసింది. ఈ కమిటీలో ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సభ్యులుగా ఉన్నారు. సీఈసీ, ఈసీ పదవులకు ఎంపిక చేసిన పేర్లను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సిఫార్సు చేయగా ఆమె ఆమోదం తెలిపారు. ఆ వెంటనే అధికారిక ప్రకటనలు వెలువడ్డాయి. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం చేపట్టిన తొలి ఎంపికలు ఇవి. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ పదవీకాలం మంగళవారంతో ముగియనుండగా ఎంపిక కమిటీ సోమవారం సాయంత్రం దిల్లీలోని ప్రధాని కార్యాలయంలో సమావేశమైంది. సంప్రదాయం ప్రకారం ఎన్నికల కమిషనర్లలో సీనియర్‌ను సీఈసీగా నియమిస్తుంటారు. దానినే కొనసాగిస్తూ.. రాజీవ్ కుమార్ తర్వాత సీనియర్ అయిన జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ పదవికి ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. జ్ఞానేశ్ సీఈసీగా బాధ్యతలు చేపట్టనున్నందున ఆయన స్థానంలో ఎన్నికల కమిషనర్‌గా వివేక్ జోషిని ఎంపిక చేశారు. సుఖ్‌బీర్ సింగ్ సంధు ఇప్పటికే మరో ఈసీగా ఉన్న విషయం తెలిసిందే. కేరళ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి జ్ఞానేశ్ కుమార్ (61)...గత ఏడాది మార్చిలో ఎన్నికల కమిషనర్ (ఈసీ)గా నియమితులయ్యారు. 2019లో కేంద్ర ప్రభుత్వం అధికరణం 370 రద్దు కోసం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును రూపొందించడంలో జ్ఞానేశ్ కుమార్ కీలక పాత్ర వహించారు. కేంద్ర హోంశాఖలో అప్పుడు ఆయన సంయుక్త కార్యదర్శి (కశ్మీర్ డివిజన్). ఆ తర్వాత సహకార శాఖ కార్యదర్శిగా 2024 జనవరిలో పదవీ విరమణ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సన్నిహిత సంబంధాలు ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. జ్ఞానేశ్... సీఈసీగా 2029 జనవరి 26వ తేదీ వరకు కొనసాగుతారు. ఆయన పర్యవేక్షణలోనే ఈ ఏడాది చివరిలో బిహార్, వచ్చే ఏడాదిలో తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కొత్త చట్టం ప్రకారం సీఈసీని నియమించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 19న విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణ ముగిసే వరకు కొత్త సీఈసీపై నిర్ణయాన్ని వాయిదావేయాలని త్రిసభ్య కమిటీ సమావేశంలో పాల్గొన్న రాహుల్ గాంధీ సూచించినట్లు సమాచారం.




## రేవంత్ తీరుతో కాంగ్రెస్ సర్కారు ఉంటుందో, పోతుందో..

(మొదటిపేజీ తరువాయి)

"సివిల్ సర్వెంట్ల పనితీరు బాగోలేదని.. ఒక తప్పు చేయమంటే మూడు తప్పులు చేస్తున్నారని.. ఏసీ గదులను వదిలి బయటకు రావడంలేదు అని రేవంత్‌రెడ్డి అంటున్నారు. సీఎం పదవిలో ఉంటూ మీరే ఒక తప్పు చేయాలని అంటే.. వాళ్లు మూడు తప్పులు చేయకుండా ఎలా ఉంటారు? దీనిబట్టి అవినీతి జరుగుతున్నట్లు మీరే ఒప్పుకొన్నట్లైంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చింది. కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్. నిరుద్యోగులకు భృతి, యువతులకు స్కూటీ, తులం బంగారం, ఉద్యోగులకు పీఆర్సీ, 4 డీఏలు, రైతులకు రైతుభరోసా, వరి బోనస్ బాకీ పడింది. కులగణన పేరుతో కొరివితో తలగోక్కుంటోంది. కొందరు క్రైస్తవులు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటూ ఎస్సీలకు నష్టం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంఘాలు ఏమి చేస్తున్నాయి? హిందూ సమాజానికి తీరని నష్టం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులంతా గుణపాఠం చెప్పాలి" అని బండి సంజయ్ పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీలు రఘునందన్‌రావు, జి.నగేశ్, ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్.ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, బొడిగే శోభ, భాజపా ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్య పాల్గొన్నారు.

## దేశంలో, రాష్ట్రంలో భవిష్యత్తు బీసీలదే



- తెలంగాణకు ఏదో ఒక రోజు కాంగ్రెస్ బీసీ నేత సీఎం అవుతారు
- 9వ షెడ్యూల్ సవరణకు మోదీని ఒప్పించే శక్తి బండి సంజయ్‌కి ఉందా?
- కాంగ్రెస్ ఓబీసీ విభాగం సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రజానావ, హైదరాబాద్ :** దేశంలో, రాష్ట్రంలో భవిష్యత్తు బీసీలదేనని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఏదో ఒక రోజు తెలంగాణలో బీసీ నేతను సీఎం చేసే సత్తా కాంగ్రెస్‌కు ఉందని, భాజపా, భారాసలు ఆ పని చేయగలవా అని ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్ ఆవరణలోని ఇందిరాభవన్‌లో బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అధ్యక్షతన పీసీసీ ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం ఛైర్మన్ కెప్టెన్ అజయ్‌సింగ్ యాదవ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్, ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అనిల్‌కుమార్ ఈరవత్రి, ప్రొఫెషనల్ కాంగ్రెస్ వార్ రూం ఇన్‌ఛార్జి సంతోష్‌కుమార్ రుద్ర తదితరులు పాల్గొన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి బిల్లును ప్రవేశపెడతాం. దీని ఆమోదం కోసం అఖిలపక్షాన్ని తీసుకువెళ్లి ప్రధాని మోదీని కూడా కలుస్తాం. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌ను సవరించాలని, దేశవ్యాప్తంగా జనగణన, కులగణన నిర్వహించాలని ప్రధాని మోదీని ఒప్పించే శక్తి బండి సంజయ్‌కి ఉందా? బీసీల్లో ఐక్యత లోపించింది. అందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. బండి సంజయ్‌ని భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా తొలగిస్తే పార్టీలకతీతంగా బీసీ నాయకులందరం స్పందించాం. కాంగ్రెస్ శ్రేణులు సోషల్ మీడియాపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు.

## భాజపా, భారాసల మధ్య లోపాయికారీ ఒప్పందం

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజానావ, నిజామాబాద్ :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వస్తుందనే భారాస తమ అభ్యర్థిని నిలపలేదని, భాజపా అభ్యర్థి గెలుపునకు రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం జరిగినట్లు స్పష్టమవుతోందని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నిజామాబాద్ నగరంలో సోమవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో హాజరైన ఆయన సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలకు పట్టభద్రుల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఇంతటి దుర్భర ఆర్థిక పరిస్థితిలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి, ఉపకారవేతనాల విడుదలలో జాప్యానికి కేసీఆర్ చేసిన అప్పులే కారణమన్నారు. పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి వేసేందుకు నిశ్చయించుకున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, ఆకుల లలిత, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పార్టీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## భాజపా చెబితేనే హిందుత్వమా..?

### మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజానావ, పెద్దపల్లి:** తాము చెబితేనే హిందుత్వమని, హిందువులపై తమకే హక్కు ఉందన్నట్లుగా భాజపా నాయకులు ప్రవర్తిస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు దుయ్యబట్టారు. సోమవారం పెద్దపల్లిలో జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "గాంధీ కుటుంబంపై కేంద్ర మంత్రి మతపరమైన ఆరోపణలు చేయడంలో అర్థం లేదు. ఇందిరా గాంధీ, ఫిరోజ్‌ల వివాహం పూర్తిగా హిందూ సంప్రదాయం ప్రకారం జరిగింది. అప్పటి నుంచే గాంధీ ఇంటిపేరుగా మారిపోయింది. ఇవేవీ తెలుసుకోకుండా మాట్లాడటం తగదు. బీసీ రిజర్వేషన్లపై కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ సవరణ చేయాలి. స్వతంత్ర భారతదేశంలో మొదటిసారిగా చేపట్టిన కులగణనపై భాజపా నాయకులు తప్పుదారిపట్టించేలా మాట్లాడుతున్నారు. పెద్దపల్లి జిల్లా ప్రజలకు ప్రధానమైన పత్తిపాక జలాశయం నిర్మాణం తప్పనిసరిగా పూర్తి చేస్తాం. జిల్లా కేంద్రంలో ఐటీ టవర్ ఏర్పాటుకు పదెకరాల ప్రభుత్వ స్థలం సిద్ధంగా ఉంది" అని శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి : ఆర్.కృష్ణయ్య



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో 61 ఏళ్లుదాటిన వీఆర్‌ఏల వారసులకు జీవో నం.81 ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగ ఐకాస ఛైర్మన్ నీల వెంకటేశ్, వీఆర్‌ఏ వారసుల ఐకాస అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. వారికి మద్దతు తెలిపిన అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. గత భారాస ప్రభుత్వం వీఆర్‌ఏలకు పేస్కేల్‌తోపాటు వారసులకూ ఉద్యోగాలిస్తామని అసెంబ్లీలో ప్రకటించిందన్నారు. దాని అమలుకు వీఆర్‌ఏలు సమ్మె చేస్తే జీవో నం.81, 85లను విడుదల చేసిందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20,555 మంది వీఆర్‌ఏలలో.. డిగ్రీ చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఇంటర్ ఉత్తీర్ణులను రికార్డు అసిస్టెంట్లుగా, పదో తరగతి లోపు చదివిన వారిని రెవెన్యూతోపాటు వివిధ శాఖల్లో ఆఫీస్ సబార్డినేట్లుగా సర్దుబాటు చేసిందన్నారు. వారి సంఖ్య 16,758 మంది కాగా.. మిగిలిన 3,797 మంది 61 ఏళ్లు పైబడిన వారని ఆయన చెప్పారు. సంబంధిత వారసులకు జీవో నం.81 ప్రకారం ఉద్యోగాలివ్వాల్సి ఉండగా..ఇప్పటికీ కొలువులు దక్కలేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు చొరవ చూపి వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలిచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఐకాస నేతలు రాజేందర్, అంజి, రాందేవ్, రామకృష్ణ, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పురుగు మందుల విక్రేతలపై పీడీ యాక్ట్

### అగ్రోకెమికల్స్ సంఘం ప్రతినిధులతో తుమ్మల




**ప్రజానావ, హైదరాబాద్ :** నకిలీ పురుగు మందుల విక్రేతలపై పీడీ యాక్ట్ విధించి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ అగ్రోకెమికల్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌కు వచ్చి సచివాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల వారితో మాట్లాడుతూ.. "రాష్ట్రంలో పురుగు మందుల క్రయవిక్రయాలు, నిల్వల సమాచారం కోసం ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తాం. విక్రేతలకు లైసెన్సుల విధానాన్ని ఆన్‌లైన్ చేశాం. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏటా 4 వేల పురుగు మందుల నమూనాలను పరీక్షించే సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. పురుగు మందుల వినియోగాన్ని నియంత్రించే విధంగా వ్యవసాయశాఖతో కలిసి అగ్రోకెమికల్స్ అసోసియేషన్ ప్రతినిధులు పనిచేయాలి" అని మంత్రి కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకుడు గోపి, అగ్రోకెమికల్స్ సంఘం నేతలు ఆర్‌జీ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కాంగ్రెస్‌లో అయోమయ పరిస్థితులు ?

## దీపాదాస్ మున్షీ మార్పు దేనికి సంకేతం.. మీనాక్షి నటరాజన్ నియామకం కలసి వచ్చేనా

**ప్రజానావ, హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులను ఏకతాటిపైకి తేవడం, ప్రభుత్వంతో సమన్వయం చేయడంలో కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ పూర్తిగా విఫలం అయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఆమె పెద్దగా ప్రభావం చూపలేకపోయార. అలాగే పార్టీ శ్రేణులు కలసి నడిచేలా చేయలేకపోయారన్న అపవాదు ఉంది. ఈ క్రమంలో అనూహ్యంగా అమెను మార్చారు. ఆమె స్థానంలో మీనాక్షి నటరాజన్ ను నియిమించారు. నిజానికి ఇది ఊహించని పరిణామం. ఇకపోతే బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో మునిగిందంటూ విమర్శలు చేస్తున్న సిఎం రేంవత్ , మంత్రులు తమ హయాంలో జరుగుతున్న అవినీతి గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అందకే అవినీతి విషయంలో కూడా ప్రభుత్వంపై విమర్శలు మొదలయ్యాయి. కొంత మంది మంత్రులు ఒంటెద్దు పోకడలతో ఉన్నారు. ఇలాంటి వారిని మందలించి దారికితేవడంలో దీపాదాస్ మున్షీ విఫలం అయ్యారు. అలాగే ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యం లేకుండా పోతోందని కొందరు శాసన సభ్యులు వాపోతున్నారు. వారు ప్రత్యేకంగా గ్రూప్ మీటింగ్‌లు పెట్టుకుంటున్నారు. ఎమ్మెల్యేలలో నెలకొన్న ఈ భావన అసంతృప్తికి దారి తీయకముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేల్కొనడం మంచిది. అందుకే ముందుగా దీపాదాస్‌పై వేటు పడిందన్న విమర్శా ఉంది. పార్టీ ఫండ్ కోసం తెలంగాణపై ఆధారపడుతున్న కాంగ్రెస్ అధిష్ఠానం ప్రభుత్వ పనితీరు మెరుగుకు మార్గదర్శనం చేయలేని పరిస్థితిలో ఉంది. కర్ణాటక కాంగ్రెస్ నాయకులు చేతులెత్తేయడంతో ప్రతి అవసరానికీ కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై ఆధారపడుతోంది. ఈ కారణంగా ప్రభుత్వంలో అవినీతి పెరగడానికి ఆస్కారం ఏర్పడుతోంది. ఈ క్రమంలోనే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మార్చడం ద్వారా కాంగ్రెస్ అధిష్ఠానం వ్యతిరేక సందేశం ఇచ్చిందని అంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా బాలారిష్టాలను అధిగమించలేదన్న భావన విస్తృతంగా ఉంది. ఈ కారణంగా ఎన్నికల ఫలితాల తర్వాత డీలా పడిపోయిన భారత రాష్ట్ర సమితిలో భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడే ప్రమాదం పొంచి ఉండటం కూడా రేవంత్ సర్కార్‌కు సవాలు కానుంది. సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పును ఇస్తుందో అన్న ఆసక్తి నెలకొంది. తమకు అనుకూలంగా తీర్పు వస్తుందన్న భరోసాలో బిఆర్ఎస్ ఉంది. సుప్రీం తీర్పు వల్ల ఉప ఎన్నికలు వస్తే ఫలితం ఎలా ఉంటుందోనన్న బెంగ పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలలో ఉంది. ఈ కారణంగా వారిలో కొందరు సొంతగూటికి చేరే ఆలోచన చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే రేవంత్ సర్కార్‌కు నైతికంగా దెబ్బ తినగలదు.. కేటిఆర్ పదేపదే చెబుతున్నట్లుగా ప్రజలు బిఆర్ఎస్ పాలనకోసం ఎదురుచూడడం లేదుగానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాత్రం పెదవి విరుస్తున్నారు. ఇకపోతే ఎదురుదాడి చేసే క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న విమర్శలు లేదా వ్యాఖ్యలు లేనిపోని అనర్థాలను తీసుకుని వస్తున్నాయి.





# కులగణన సర్వేతో ప్రభుత్వం అభాసుపాలు !

ప్రధాని మోడీ బిసి కాదు..ఆయన కులం తరవాత బిసిలో చేరింది...అందుకే మోడీ బిసి అయ్యారు. అందువల్ల ముందునుంచీ ప్రధాని మోడీ బిసి కాదు...ఈ విసయాన్ని ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి ప్రస్తావిస్తూ.. అసలు మోడీ బిసియే కాదని సెలవిచ్చారు. ఇప్పుడు మోడీ బిసి అయినంత మాత్రన ఒరిగేదేమీ లేదు. కానందువల్ల వచ్చే నష్టం కూడా లేదు. బిసి కులగణన సందర్భంగా జరుగుతన్న విమర్శలకు సమాధానం ఇచ్చే క్రమంలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. నిజానికి రాజకీయాల్లో ఇలాంటి వ్యాఖ్యలే అస్థిరతకు కారణం అవుతాయి. తనకు రాజకీయల లబ్ది జరుగుతుందని భావించే సిఎం రేవం÷– ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందులో సందేహం లేదు. దీనిని బిజెపి నేతలు సభజంగానే తిప్పికొట్టారు. సిఎం రేవంత్‌పైనా విరుచుకు పడ్డారు. రాహుల్ కులమేంటో చెప్పాలన్న డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజలకు మేలుచేసేవి ఎంతమాత్రం కాదు. రెచ్చొగట్టే వ్యాఖ్యలతో రాజకీయాలను కలుషితం చేయరాదు. రాజకీయ నాయకులు అసలు విషయం మరచి, పాలనను మరచి ఇలాంటి వ్యాఖ్యలతో కాలక్షేపం చేస్తూ ఉంటారు. నిజానికి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలు అవుతోంది. ఈ కాలంలో ఎన్ని మంచి పనులు చేశామో, ఎన్ని చేయలేకపోయామో ఆత్మవిమర్శల చేసు కోవాల్సి ఉంది. అలాగే కులగణనతో జరిగే లాభం అంతకన్నా లేదు. ఎందుకంటే కులగణనతో బిసి రిజర్వేషన్లు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి లేదు. అసెంబ్లీలో కులగణన సర్వే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం ఓ రకంగా అభాసు పాలయ్యింది. అందుకే మరోమారు రీ సర్వేకు ఆదేశించింది. తొందరపడి సర్వే చేపట్టడం కేవలం రాహుల్‌ను సంతృప్తి పరచే రాజకీయ విన్యాసం తప్ప మరోటి కాదు. రాహుల్ ఆదేశాలను పాటించేందుకే ఉన్నానని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు..కనుక ఈ తతంగం అంతా అందుకోసమే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ క్రమంలోనే తీవ్ర విమర్శలు రావడంతో కలుగణన రీసర్వే మొదలైంది. ఈనెల 28 వరకు కులగణనలో నమోదు చేసేందుకు ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అవకాశం కల్పించింది.




ప్రజలు మూడంచెల విధానంలో రెండోసారి సర్వే చేస్తోంది సర్కార్. మరోవైపు రీసర్వేపైనా వి విపక్షాలు మర్మలు గుప్పిస్తున్నాయి. చిత్తశుద్ధిలేని సర్వేలు ఎన్నిసార్లు చేసిన బూడిదలో పోసిన పన్నీరే అంటున్నాయి. తెలంగాణలో కులగణన తప్పుల తడక అంటూ విపక్షాలు, బీసీ , ఎస్సీ ఎస్టీ సంఘాల నుంచి విమర్శలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రీ సర్వే చేపట్టింది. కులగణనలో వివరాలు నమోదు చేసుకోనివారంతా ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరుతున్నారు. రెండోసారి సర్వేకోసం మూడంచెల విధానాన్ని అధికారులు అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్ తో పాటు ఆఫ్ లైన్‌లోనూ వివరాలు సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. ఫోన్ చేసిన వారి ఇళ్లకి వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. కులగణనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏకంగా బీసీ కమిషన్ రంగంలోకి దిగింది. గతంలో నిర్వహించిన సర్వేలో మొత్తం కోటి 15లక్షల కుటుంబాలకు గాను కోటి12 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో వెల్లడించింది. కులగణనలో పాల్గనని 3లక్షల 56వేల మంది కోసం రెండోసారి సర్వేకు అవకాశం కల్పించింది. మొత్తంగా సర్వే అభాసు పాలయ్యింది. పరస్పర విమర్శలు మిగిలాయి. మోడీ కులంతో పాటు, రాహుల్ కులం గురించి కూడా విమర్శలు రావడం చూస్తున్నాం. ఇకపోతే పాలనా పగ్గాలు చేపట్టిన తరవాత కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంలోనే రేవంత్ రెడ్డి కాలం గడిచి పోతోంది. ఢిల్లీ ప్రదక్షిణలకే సమయం సరిపోవడం లేదు.

ఢిల్లీ నేతలు కూడా తరచూ తిప్పించుకునే పనిని మానడం లేదు. ఇకపోతే మంత్రులు ఎవరికి వారు యమునాతీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సిఎం రేవంత్ రెడ్డి పరిస్థితి దినదినగండంగా ఉంది. స్పష్టమైన పనులు చేపట్టలేదు. పాలనలో దూకుడు కనిపించడం లేదు. అందుకే ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి మెల్లగా వ్యాపిస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ముద్ర పాలనపై ఇంకా పడలేదు. ఎందుకంటే కాంగ్రెస్ 15 నెలల పాలనలో ఏం జరిగిందో చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. కనీసం రేషన్ కార్డుల సంస్కరణలు జరగేలదు. కిలో బియ్యం ధరలను పెంచలేదు. ఖర్చులను తగ్గించుకోవడం లేదు. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రజలను ఎంతోకాలం నమ్మించలేమని కాంగ్రెస్ నేతలు తెలుసుకుంటే మంచిది. బిసి కులగణన లాంటిది హడావిడిగా అమలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం అభాసుపాలవుతోంది. రైతురుణ మాఫీ వల్ల లాభం కన్నా విమర్శలే ఎక్కువగా ఉన్నాయి. దాదాపు రూ.25వేల కోట్ల మేర రుణమాఫీ చేసినా ఆశించిన రాజకీయ ప్రయోజనం నెరవేరలేదు. రైతు రుణ మాఫీ చేసి కూడా విమర్శలు ఎదుర్కొంటున్నారు. రైతులు కూడా సంతృప్తిగా లేరు. రేషన్ కార్డుల పంపిణీ వ్యవహారంలో, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు స్వీకరణలో కూడా సరైన కసరత్తు సక్రమంగా జరగలేదు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని నిర్మించాలనే విషయంలో కూడా నేతల్లో స్పష్టత లేదు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటే సాధ్యమా అన్నది ఆలోచన చేయడం లేదు. పేదలకే రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు అన్న ధృడవైఖరి కొరవడింది..మొత్తం మీద రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆశించిన మేర పనిచేయడం లేదన్న అభిప్రాయం వ్యాపిస్తోంది. ఈ వ్యతిరేక భావనను మొగ్గలోనే తొలగించని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అప్రతిష్ఠపాలవుతుంది. కేంద్రంలోని కాంగ్రెస్ అధిష్టానం కూడా స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాలి. అదేపనిగా నేతలను ఢిల్లీకి పిలించుకుని కాలక్షేపం చేసే ప్రయత్నాలు మానుకోవాలి. లేకుంటు కాంగ్రెస్ మారదన్న ధృడవైరికి ప్రజలు రాగలరు.

# ఢిల్లీ పరిసరాల్లో స్వల్ప ప్రకంపనలు

- రిక్టర్ స్కేల్ పై భూకంపం తీవ్రత 4.0 గా నమోదు
- అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోడీ హెచ్చరిక

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని న్యూఢిల్లీతో పాటు పలు పరిసర ప్రాంతాల్లో సోమవారం భూకంపం సంభవించింది. తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ప్రకంపనలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తెల్లవారుజాము కొద్ది సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో భయాందోళనలకు గురైన ప్రజలు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. రిక్టర్ స్కేల్ పై భూకంపం తీవ్రత 4.0 గా నమోదు అయింది. ఢిల్లీతోపాటు నోయిడా, గురుగాం ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించాయి. దేశ రాజధాని ఢిల్లీలో స్వల్ప భూప్రంకపనలు వచ్చాయని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ ఎక్స్ వేదికగా తెలిపింది. భూకంప కేంద్రం లోతు కేవలం 5 కిలోమీటర్లు మాత్రమేనని స్పష్టం చేసింది. కొన్ని సెకన్ల పాటు మాత్రమే భూమి కంపించడంతో భయాందోళనలకు గురైన జనం ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. మంచం నుండి కిటికీ వరకు ప్రతిదీ కదలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దిల్లీ, నోయిడా, గురుగ్రామ్ ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 4.0గా నమోదైంది. ధౌలా కాన్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలేజీ సమీపంలో 5 కిలోమీటర్ల భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రకంపనలు సంభవించిన సమయంలో భారీ శబ్దం వినిపించడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ఢిల్లీలో సంభవించిన భూకంపంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. మళ్లీ భూప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని... అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. భద్రతా చర్యలు పాటించాలని, పరిస్థితులను అధికారులు సునిశితంగా పరిశీలిస్తున్నారని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'దిల్లీ, పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి. భద్రతా చర్యలు పాటించాలి. మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. పరిస్థితులను అధికారులు సునిశితంగా పరిశీలిస్తున్నారని ప్రధాని మోదీ వెల్లడించారు.



# ఆర్టీసీ ప్రయాణికులకు మరో గుడ్‌న్యూస్

## తెలంగాణ టు బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు 10శాతం రాయితీ

**ప్రజానావ, హైదరాబాద్ :** తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు కాంగ్రెస్ ప్రభుత్వం మరోగుడ్‌న్యూస్ చెప్పింది. ఇప్పటికే తెలంగాణలో మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ కార్డ్ ఉన్న ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ప్రయాణ ఛార్జీలో ఏకంగా 10 శాతం రాయితీని ప్రకటించింది. అయితే ఇది అన్ని రూట్లలో కాదు. తెలంగాణ నుంచి బెంగళూరుకు ప్రయాణించే వారికి టిక్కెట్ ధరలో పది శాతం రాయితీ కల్పిస్తున్న ప్రకటించింది. బెంగళూరు రూట్‌లో నడిచే అన్ని సర్వీసుల్లోనూ రానుపోనూ ఈ రాయితీ వర్తించనుంది. ఈ రాయితీ వల్ల ఒక్కొక్కరికి రూ.100 నుంచి రూ.160 వరకూ ఆదా అవుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ రూట్ లో టికెట్ల ముందస్తు రిజర్వేషన్ కోసం వెబ్ సైట్‌ని సంప్రదించాల్సింది సూచించారు. అయితే తెలంగాణ నుంచి చాలా మంది బెంగళూరు సిటీకి వెళ్తుంటారు. వ్యాపార పనులపై, అలాగే ఉద్యోగ రిత్యా అక్కడ పనిచేసే వారు కూడా తరచూ బెంగళూరుకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇలాంటి వారికి ఇప్పుడు టీజీఎస్ ఆర్టీస్ ప్రకటించిన ఈ రాయితీ ఎంతో మేలు కూరుతుంది.




# కుటుంబ కలహాలతో నిండుప్రాణం బలి

- భార్య, పిల్లలను చూడటానికి వెళ్తే.. నిప్పటించిన అత్తారింటివారు
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజానావ, కొత్తగూడెం :** కుటుంబ కలహాలు నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. దంపతుల మధ్య కలహాలు రావడంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. తర్వాత భర్త.. అత్తగారింటికి వెళ్లి భార్య పిల్లలను చూద్దామనుకుంటే.. అత్తింటి వారు అతడిని అడ్డుకున్నారు. అంతేనా.. ఇంటి అల్లుడన్న విషయం మరచి అతడిపై అత్తామామ, బామ్మర్దులు ఏకంగా పెట్రోల్ పోసి నిప్పంటించి, ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఒళ్లంతా మంటలు రేగడంతో అతడు సమీపంలోని నీటి తొట్టిలో పడిపోయాడు. ఇరుగు పొరుగు గమనించి ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈ దారుణ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రామచంద్రునిపేటకు చెందిన ఎజ్జు వెంకటేశ్వర్లు, అనురాధ దంపతుల కుమార్తె కావ్య. ఆమెను మూడేండ్ల క్రితం పాల్వంచ మండలం దంతలబోరు గ్రామానికి చెందిన బల్లెం గౌతమ్ (24) ప్రేమ వివాహం చేసుకున్నాడు. గౌతమ్ ఎలక్ట్రిషన్ పనిచేస్తూ సుజాతనగర్‌లో నివాసం కాపురం పెట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు. అయితే 5 నెలల క్రితం భార్యాభర్తలు గొడవ పడటంతో కావ్య అలిగి పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఫిబ్రవరి 2న రాత్రి భార్యా పిల్లలను చూసేందుకు గౌతమ్ అత్తింటికి వెళ్లాడు. అయితే అల్లుడు గౌతమ్‌ను అత్త మామ, బామ్మర్దులు ఇంట్లోనికి అనుమతించలేదు. దీంతో వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వారు గౌతమ్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించి ఇంట్లోకెళ్లి తలుపులు వేసుకున్నారు. మంటలకు తాళలేక గౌతమ్ కేకలు వేస్తూ పక్కనే ఉన్న నీటితొట్టిలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఇరుగు పొరుగు ఖమ్మం హాస్పిటల్‌కి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎంకి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ గౌతమ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి బల్లెం వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



# హార్వర్డ్ వర్సిటీ ర్యాపిడ్ ఫైర్ ఇంటర్వ్యూ

## అసక్తికరంగా సమాధానం ఇచ్చిన నీతా అంబానీ

**న్యూఢిల్లీ :** రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ ర్యాపిడ్ ఫైర్‌లో అడిగిన ఓ ప్రశ్నకు ఆసక్తికర సమాధానం ఇచ్చారు. ఆమె ఇచ్చిన రిప్లైతో వీక్షకులు చిరునవ్వులు చిందించారు. వారాం తంలో నీతా అంబానీ హార్వర్డ్ ఇండియన్ కాన్ఫరెన్స్ 2025లో పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన ర్యాపిడ్ ఫైర్ ఇంటర్వ్యూలో కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ప్రధాని మోద, ముకేశ్ అంబానీ వీరిలో మీకు ఎవరు గొప్ప అని అడగ్గా.. 'ప్రధాని నరేంద్రమోదీతో దేశానికి చాలా మంచి జరుగుతోంది. నా భర్త ముకేశ్ అంబానీతో మా ఇంటికి మంచి జరుగుతోంది' అని జవాబిచ్చారు. ఆమె ఇచ్చిన సమాధానంతో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వారంతా చిరునవ్వులు చిందించారు. తెలివైన సమాధానం ఇచ్చారం టూ చప్పట్లతో అభినందించారు. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాల యంలో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక వార్షిక భారత సదస్సులో నీతా అంబానీ కీలకోపన్యాసం చేశారు. భారత వాణిజ్యం, విధానాలు, సంస్కృతి వంటి అంశాలపై మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో భారత కళలు, సంస్కృతిలోని వివిధ కోణాలు.. అవి పోషించే గణనీయమైన పాత్రపై చర్చించారు. ఈ సందర్భంగా నీతాకు అమెరికాలో అరుదైన గౌరవం లభించింది. దాతృత్వ, సామాజిక సేవా కార్యక్రమాలతో గ్లోబల్ ఛేంజ్ మేకర్‌గా నీతా అంబానీ నిలుస్తున్నారని మసాచుసెట్స్ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకు గాను బోస్టన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతిష్ఠాత్మకమైన గవర్నర్ ప్రశంసాపత్రాన్ని నీతా అంబానీకి ఆ రాష్ట్ర గవర్నర్ మౌరా హీలీ అందజేశారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
మంగళవారం
18 ఫిబ్రవరి 2025


# ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి

- గంజాయి నిందుతులుగా ఉన్న వారిపై నిఘా ఉంచాలి
- వేములవాడ సబ్ డివిజన్ అధికారులతో ఎస్పీ సమీక్ష



**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లా పోలీస్ కార్యాలయంలో భాగంగా సోమవారం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారీగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో విచారణ స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై ఎస్పీ అఖిల్ మహాజన్ సమీక్షించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నేరం జరిగిన ఘటనా స్థల పరిశీలన , సాక్ష్యాధారాలు సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు, కోర్టు ట్రయిల్స్ వరకు తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమంగా ఇసుక తవ్వకలు, రవాణా చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఇసుకను అక్రమంగా రవాణాకు పాల్పడే వారిపట్ల సున్నితంగా వ్యవహరించవద్దని అధికారులను అదేశించారు. జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారి కదలికలు గమనిస్తూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గంజాయి కిట్ల సహాయంతో తనిఖీలు నిర్వహించాలన్నారు. నేరాల నియంత్రణ కోసం సాంకేతిక పరిజ్ఞానం వినియెగించుకోవాలని అధికారులకు సూచించారు. అటవీ జంతువులను వేటాడే వారిపై నిఘా కఠినతరం చేయాలని, తరచూ జంతువుల వేటకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేయాలని తెలిపారు. కుల పంచాయతీ పేరుతో కుల బహిష్కరణకు పాల్పడుతే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు మారుతి, అశోక్, ప్రశాంత్ రెడ్డి, పృథ్వీందర్ గౌడ్, ప్రేమానందం, ఐటీ కోర్ ఎస్ఐ కిరణ్, డీసీఆర్బీ ఎస్ఐ జ్యోతి, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పథకాలు అందరికీ వివరించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం



**ప్రజానావ, సిరిసిల్ల:** కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వివరించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని కే కన్వెన్షన్ హాల్‌లో మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉన్న పట్టభద్రులకు 50 మందికి ఒకరిని ఇన్‌చార్జిగా పెట్టుకొని ఎన్నికల్లో ముందుకు సాగాలన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన పది నెలల్లో ఇచ్చిందని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ వేస్తే మళ్లీ ప్రజా ప్రభుత్వంలోనే వేయడం జరిగిందన్నారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో లేకుండా బీజేపీతో ఒక లోపాయకారి ఒప్పందం చేసుకుందని విమర్శించారు. నాడు రాష్ట్రపతి ఎన్నికల్లో నల్ల చట్టాల అమలు సమయంలో బీఆర్ఎస్ బీజేపీకి మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ పార్టీల వ్యవహార శైలి గల్లీలో లొల్లి.. ఢిల్లీలో దోస్తీగా మారిందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీ ఫైనల్‌ని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఫైనల్‌గా అభివర్ణించారు. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులపై అనేక అక్రమ కేసులను పెట్టారని, నేడు ప్రజా ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పాటు పడుతుందని పేర్కొన్నారు.







దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున నుంచే భక్తుల తాకిడి నెలకొంది. ధర్మగుండంలో స్నానాలాచరించి తలనీలాలు సమర్పించుకున్నారు. సోమవారం రాత్రి వరకు 50వేలకు పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

- ప్రజానావ, వేములవాడ

# కామన్ డైట్ మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

- సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- తంగళ్లపల్లి మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయం ఆకస్మిక తనిఖీ



**ప్రజానావ, సిరిసిల్ల:** నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రతి రోజూ కామన్ డైట్ మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లిలోని సిరిసిల్ల మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిలోనీ బియ్యం, కూరగాయలు, పండ్లు, కోడి గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆర్ఓ ప్లాంట్ పరిశీలించి, స్వయంగా కలెక్టర్ ఆ నీటిని తాగి నాణ్యతను తనిఖీ చేశారు. నాణ్యత ప్రమాణాలు మేరకే ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలు, కోడి గుడ్లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. పబ్లిక్ పరీక్షల దృష్ట్యా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టీ నిత్యం చదివించాలని ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూసా ఫాతిమా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న భక్తుడికి ఫిట్స్

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు ఫిట్స్ వచ్చి ఆలయ ప్రాంగణంలో పడిపోయాడు. మంచిర్యాల జిల్లా లక్షేటిపేట మండలం చెందిన లెంకల తిరుపతి అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలసి సోమవారం ఉదయం రాజన్న దర్శనానికి వచ్చాడు. ఈ క్రమంలో అతనికి ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడే మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన%శీ% సందర్భంగా రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కులు చెల్లిస్తున్న బీఆర్ఎస్ నాయకులు గమనించి కుటుంబ సభ్యుల సాయంతో హుటాహుటిన చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆలయంలో నిత్యం ఇలాంటి ఏదో ఒక సంఘటన జరుగుతున్న అందుబాటులో ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులో లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం




**ప్రజానావ, వెంకటాపూర్(రామప్ప):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని నర్సింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎండీ సర్వర్ ఆధ్వర్యంలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులే ఉపాధ్యాయులై ఒకరోజు పాఠశాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వర్ అహ్మద్ విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయాలని సంకల్పంతో విద్యార్థులను విద్యార్థులతో విద్యా బోధన చేయడం జరిగింది. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎండీ సర్వర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల బోధన శ్రమను గుర్తించాలని, ఒకరోజు పాఠశాల నిర్వహణ చేసిన విద్యార్థులు అభినందనీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో గా పొలం రిషీ, ఎంఈవో గా సహజ్, ప్రధానోపాధ్యాయులు కోట సంజన, ఉపాధ్యాయులుగా అక్షిత, సాంబలక్ష్మి, పార్థివ్, సర్వేష్, మని, రితిక లు బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుమన్, అంగన్వాడీ టీచర్ సరోజన తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



**ప్రజానావ, బెజ్జంకి:** కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉట్కూరి నరేందర్ రెడ్డిని గెలిపించాలని సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేశ్ ఆధ్వర్యంలో బెజ్జంకి, కల్లేపల్లి గ్రామాల్లో గ్రాడ్యుయేషన్ ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో సద్గురు రవీందర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బోనగిరి మహేందర్, దొంతర వేణి మహేశ్, మాజీ ఉప సర్పంచ్ పర్స సంతోష్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బుర్ర రవి, కాంగ్రెస్ నాయకులు భూపాల్ పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

**ప్రజానావ, వెంకటాపూర్(రామప్ప):** ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినమైన చర్యలు తప్పవని వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్ హెచ్చరించారు. సోమవారం పోలీస్ సిబ్బందితో లింగాపూర్ జాతీయ రహదారిపై ఇసుక లారీలను తనిఖీ చేశారు. ఇసుక లారీల యజమానులు డీడీలు లేకుండా తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా క్వారీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఒక లారీకి బదులు మరొక దానిలో ఇసుకను తరలించినా, ఓవర్ లోడ్ ఉన్నా, జేసీబీ లోడింగ్ చార్జీల పేరుతో అక్రమ వసూళ్లు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# అక్రమ ఇసుక రవాణా నియంత్రణకు కందకం




**ప్రజానావ,బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని తోటపల్లి, గాగిల్లాపూర్ వద్ద మోయ తుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతున్న నేపథ్యంలో, పోలీసులు మరియు రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడానికి వాగు పరిసర ప్రాంతాల్లో కందకం తవ్వించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జే. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇకపై ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు సహకరించాలని, ఇసుక అక్రమ రవాణా నివారణకు ఎవరైనా సమాచారం అందిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జనావాసాల మధ్య ప్రైవేట్ ఆస్పత్రి వ్యర్థాలు



**ప్రజానావ, జమ్మికుంట:** జమ్మికుంట పట్టణ పరిసర ప్రాంతానికి చెందిన గణేశ్ నగర్ కాలనీలో జనావాస ప్రాంతంలో ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు సంబంధించిన వ్యర్థాలు మరియు ఔషధాల (బయో వేస్టేజ్) ను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా , శాస్త్రీయతను పాటించకుండా బహిరంగ ప్రదేశం లో ఖననం చేయడం జరుగుతుంది , దీని కారణంగా అత్యంత దుర్వాసన లు వెలువడడం , స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజానవ దినపత్రిక ముందు వారి గోడును వినిపించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన ప్రైవేట్ ఆస్పత్రి పై ప్రభుత్వ అధికారుల కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు అంతేకాకుండా అధికారులు స్పందించి చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని కోరడం జరిగింది.



## ఘనంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు

**ప్రజానావ, ఏటూరు నాగరం:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ములుగు జిల్లా ఏటూరు నాగరం మండల కేంద్రంలోని బ స్టాండ్ ఆవరణలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నరసింహారావు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు గాధదాసు సునీల్ కుమార్ అధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ ఖాజా పాషా, నూతి కృష్ణమూర్తి, తాడూరి రఘు, మాదరి రామయ్య, కుమ్మరి చంద్రబాబు, దొడ్డ కృష్ణ, అల్లి శ్రీను, తురం పద్మ, ఈసం స్వరూప, బండి లక్ష్మి, వావిలాల పోశయ్య, కొమ్మెర రమేష్, జాడి బోజారావు, కాళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దత్తత గ్రామంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

**ప్రజానావ, మర్కూక్:** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం నరసన్నపేట గ్రామంలో మాజీ జడ్పీటీసీ ఏంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్, మాజీ సర్పంచ్ కానుగంటి మాధవి రాజిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.



# కేసీఆర్ జన్మదిన వేడుకలు



## పచ్చని పంట పొలాల మధ్య..

ప్రజానావ, మంగపేట: మంగపేట మండలం తిమ్మంపేటలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మ దిన వేడుకలను మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో పచ్చని పంట పొలాల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తోట రమేశ్, జిల్లా నాయకుడు తాటి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, సీనియర్ నాయ కులు చిలకమర్రి రాజేందర్, చిలకమర్రి లక్ష్మయ్య, చిట్టీ మల్ల సమ్మయ్య, కర్రీ శ్యాం బాబు, శంకర్, మల్లూర్ దేవస్థాన చైర్మన్ నూతి లకంటి ముకుందం, పూజారి శ్రీనివాస్, జిల్లా మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావుల రమణ, ఎగ్గడి అర్జున్, బాలకృష్ణ, రాంబాబు, సాంబులు, ఉడుగుల శ్రీనివాస్, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రదాత.. స్వరాష్ట్ర విధాత కేసీఆర్

**ప్రజానావ, బెజ్జంకి:** కేసీఆర్ జన్మదిన వేడుకలను బెజ్జంకి మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ 'మలిదశ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్ర అపూర్వమని, ఆయన నాయకత్వంలో తెలంగాణ సాధించడమే కాకుండా.. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపారన్నారు. కేసీఆర్ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని పేర్కొన్నారు. ప్రజలకు మార్గదర్శిగా, జాతిపితగా కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని ఈ సందర్భంగా కొనియాడారు. వేడుకల్లో భాగంగా కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా హరిత తెలంగాణ లక్ష్యంగా మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, ఫ్యాక్స్ వైస్ చైర్మన్ బండి రమేశ్, మాజీ ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, అలాగే వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





ప్రజానావ, కరీంనగర్: కారణజన్ముడు.. తెలంగాణ ఉద్యమ వ్యూహకర్త, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 71వ జన్మదినోత్సవం సందర్భంగా తెలంగాణ చౌక్ లో బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్ ఆధ్వర్యంలో 71 కేజీల భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజానావ, మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం రమణక్కపేట బొడ్రాయి దగ్గర, సీఎస్ఐ కాలనీలో తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రైతుల ఆత్మ బాంధవుడు, తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో బీఅర్ఎస్ నాయకులు గుండెటి రాజు యాదవ్, గుమ్మల వీర స్వామి, మంచాల నాగేంద్ర కుమార్, కొమరం సందీప్, వెంకట కృష్ణ, ఇందారపు రమేశ్, మునిగే మహేశ్,రామారావు, సాంబయ్య, మంచర్ల మురళి, కోటి, నాగరాజు తదితర నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రజానావ, ఖైరతాబాద్: తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం ఫిల్మ్ నగర్ సాయిబాబా గుడిలో జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ కేసీఆర్ పేరు మీద ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఎన్‌బీటీ నగర్‌లో జరిగిన కేసీఆర్ పుట్టినరోజు వేడుకల్లో కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నేతలు జేజోల్లా రాజు ముదిరాజ్, భస్వ గౌడ్, కొమ్ము విజయ్ కుమార్, కరుపటి అజయ్ కుమార్, జెట్టి విజయకుమార్, పుట్టల విజయ కృష్ణ, నాగరాజు, ముర్తుజ్జా, యూసఫ్ జాయ్, నాయకులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.



## అర్జీలకు వేగంగా పరిష్కారం చూపాలి



- ప్రజావాణిలో రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- 116 దరఖాస్తుల రాక

**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రజావాణి అర్జీలకు వేగంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా వినతులు పరిష్కరించాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. హాజియా శాఖలకు వచ్చిన దరఖాస్తుల వివరాలు.. రెవెన్యూ శాఖకు - 52, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ కు- 14, జిల్లా సంక్షేమ అధికారి, ఉపాధి కల్పన అధికారికి 6 చొప్పున, ఎంపీడీఓ కోనరావుపేటకు 4, జిల్లా వైద్యాధికారి, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి, డీఆర్ డీఓ, విద్యా శాఖకు మూడు చొప్పున, వ్యవసాయ శాఖ, సెస్, ఎస్పీ కార్యాలయం, ఎంపీడీవో తంగళ్లపల్లికి రెండు చొప్పున, అటవీ శాఖ, ఎస్డిసీ, ఆర్టీఓ, మైన్స్ ఏడీ, ఆర్ సీఓ, ఎక్సైజ్ శాఖ, ఎస్సీ కార్పొరేషన్, మత్స్య శాఖ, జిల్లా పౌర సరఫరాల అధికారి, ఎంపీడీవో వీర్నపల్లి, చందుర్తి, వేములవాడ, గంభీరావుపేట బోయినపల్లికి ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్, డీఆర్డీఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## 22 నుంచి కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



### రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలో ఈ నెల 22 నుంచి నుంచి కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో మొత్తం 1129 ఎకరాల్లో కందుల సాగు జరిగిందని, మొత్తం 6 వేల 211 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అన్నారు. ఐకెపి కేంద్రాల ద్వారా గంభీర్ రావు పేట్, ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్ళపల్లి, ఎల్లారెడ్డి పేట, చందుర్తి మండలాల్లో ఐకెపి కేంద్రాల మిగిలిన చోట్ల పీఏసీఎస్ కేంద్రాల ద్వారా కందుల కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేయాలో అధికారులు నిర్ణయించి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ యార్డులలో, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కందుల కొనుగోలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి సమీప గోడౌన్లకు కందుల తరలింపు కోసం రవాణా కొరకు టెండర్ ల ద్వారా అవసరమైన వాహనాలు అందుబాటులోకి పెట్టాలని, కందుల కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులు, వెయింగ్ యంత్రాలు తేమ యంత్రాలు, టార్ఫాలిన్ లు, ఇతర సౌకర్యాలు ఉండేలా చర్యలో చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కందులు కొనుగోలుకు సంబంధించి కనీసం మద్దతు ధర, పంట నాణ్యత పరిశీలన,12 తేమ శాతం , ఇతర నాణ్యత ప్రమాణాలపై అధికారులకు అవసరమైన శిక్షణ కార్యక్రమం రేపటి నుంచి అందించాలని, ఫిబ్రవరి 22 శనివారం నుంచి జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు.

### విస్తృత ప్రచారం కల్పించాలి

తేమ 12 శాతం లోపు ఉన్న కందులకు రూ 7550/- మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని, కందుల పంట సంబంధించి అవసరమైన నాణ్యత ప్రమాణాలను రైతులకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హమాలీలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెఫెడ్ అధికారి హాబీబ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలిబేగం, డీఆర్డీఓ శేషాద్రి, డీసీఓ రామకృష్ణ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఛాంపియన్స్ ట్రోఫీ
# గ్రూప్-ఏలో భారత్

## మిగతా మూడింటిని జయించాలంటే?



**దుబాయి :** ఏడాది వ్యవధిలో భారత్ మూడో ఐసీసీ ట్రోఫీ బరిలోకి దిగుతోం ది. గత రెండింట్లో ఒకదానిని కైవసం చేసుకోగా.. మరొక ఫైనల్‌లో ఓడి రన్నరప్‌గా నిలిచింది. ఇక ఫిబ్రవరి 19 నుంచి టాప్ -8 జట్లు తలపడే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం సిద్ధ మైంది. మరి విజేతగా నిలవాలంటే తొలుత గ్రూప్ స్టేజ్‌ను అధిగమించాలి. మరి మన గ్రూప్‌లో ఏ జట్లు ఉన్నాయి? ఏ జట్టు ప్రమాదకరం? అనే విషయాలపై ఓ లుక్కేద్దాం.. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఎడిషన్‌లో భారత్ గ్రూప్ ఏలో తలపడ నుంది. ఇందులో టీమ్ఇండియా కాకుండా.. పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ ఉన్నాయి. ఈసారి వన్డే ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే, ఒక్క మ్యాచ్ ఓడినా.. సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారిపోతాయి. ఏమాత్రం భారీ ఓటమి ఎదురైనా సరే ఇంటిముఖం పట్టాల్సిందే. గ్రూప్‌లోని ప్రతి జట్టూ ప్రమాదకరమే. టీమ్ఇండియా మ్యాచులన్నీ దుబాయ్‌లోనే జరుగుతాయి. అక్కడి పరిస్థితులు కాస్త అటు ఇటుగా భారత్‌ను పోలి ఉంటాయనే ఉద్దేశంతో ఐదుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. ఆతిథ్యం ఇస్తోన్న పాక్, తాజాగా ముక్కోణపు సిరీస్‌ను సొంతం చేసుకున్న న్యూజిలాండ్, సంచలనాలు సృష్టించడంలో ముందుండే బంగ్లాదేశ్‌తో ప్రమాదం పొంచి ఉందనేది క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం.

### సంచలనాల బంగ్లా

గ్రూప్ ఏలో భారత్ ఆడబోయే తొలి మ్యాచ్ బంగ్లాదేశ్‌తోనే. ఫిబ్రవరి 20న ఈ మ్యాచ్ జరగనుంది. ఈ గ్రూప్‌లో కాస్త బలహీనమైన జట్టు బంగ్లానే. అలాగని ఏమాత్రం అజాగ్రత్త వహించినా పెను ప్రమాదం తప్పదు. 2007వన్డే ప్రపంచకప్‌లో టీమ్ఇండియాకు బంగ్లా షాక్ ఇచ్చిన సంగతి గుర్తుందిగా.. భారత్‌తో మ్యాచ్ అంటే బంగ్లాదేశ్ ప్లేయర్లు ఇంకాస్త మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తారు. కానీ, ఇప్పుడున్న ఆ జట్టు పరిస్థితిని బట్టి మ్యాచ్‌లో గెలవడం భారత్‌కు కాస్త సులువే. గత ఆరు వన్డేల్లో ఐదింట్లో బంగ్లాదేశ్ ఓడిపోయింది. ఆ జట్టు ప్లేయర్లకు ఇప్పుడు 50 ఓవర్ల క్రికెట్ ప్రాక్టీస్ కూడా లేదు. వీరంతా నేరుగా బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ నుంచి వచ్చారు. కెప్టెన్ షాంటోతోపాటు మహ్మదుల్లా, ముష్ఫికర్ రహీం, ముస్తాఫిజుర్‌పైనే బంగ్లా ఎక్కువగా ఆధారపడి ఉంది. దుబాయ్‌లో స్పిన్ హవా నేపథ్యంలో.. స్పిన్నర్ రిషద్ ప్రభావం చూపిస్తాడని బంగ్లా ఆశాభావంతో ఉంది. అయితే, బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో భారత్ భారీ విజయం సాధిస్తే మాత్రం సెమీస్ అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఇతర జట్లూ ఇదే లక్ష్యంతో ఆడతాయనడంలో సందేహం లేదు.

### అంచనాలకు అందని పాక్

ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసే మ్యాచుల్లో దాయాదుల పోరు ఒకటి. ఫిబ్రవరి 23న భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య దుబాయ్ వేదికగా మ్యాచ్ జరగనుంది. ఆతిథ్య హోదాలో బరిలోకి దిగుతున్న పాక్‌కు ఈ టోర్నీ అత్యంత కీలకం. కేవలం భారత్‌తో జరగబోయే మ్యాచ్ మాత్రమే దుబాయ్‌లో ఆడే పాక్.. తన మిగతా మ్యాచుల్లో సొంత మైదానాల్లోనే తలపడనుంది. తాజాగా ముక్కోణపు సిరీస్ ఫైనల్‌లో ఓటమి చవిచూసిన పాక్.. గత మ్యాచుల్లో మాత్రం అద్భుతమైన క్రికెట్ ఆడింది. ఇదే సిరీస్‌లో అత్యధిక టార్గెట్‌ను ఛేదించి పాక్ ఘన విజయం సాధించింది. అంతేకాకుండా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత్‌పైనే పాక్ విజయం సాధించి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. ఆ మ్యాచ్ ఓటమికి ఇప్పుడు టీమ్ఇండియా ప్రతీకారం తీర్చుకోవాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, సల్మాన్ అఘా మంచి ఫామ్‌లో ఉండటం వారికి కలిసొచ్చే అంశం. స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ పరుగులు చేయడంలో ఇబ్బంది పడుతున్నాడు. అలాగే, యువ సంచలనం సయీమ్ అయుబ్ గాయం కారణంగా వైదొలగడం పాక్‌కు నష్టమే. అదే సమయంలో బుమ్రా లేకుండానే టీమ్ఇండియా ఆడనుంది. ఇక పాక్ పేస్ త్రయం షహీన్, రవూఫ్, నసీమ్ భారత్‌పై అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తారు. టీమ్ఇండియాకు స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ నుంచి ప్రమాదం తప్పదని విశ్లేషకుల అంచనా.

### డేంజరస్ కివీస్

ఐసీసీ టోర్నీల్లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చే జట్లలో న్యూజిలాండ్ ఒకటి. ఈసారి కూడా భారత్‌కు కివీస్ నుంచి కఠిన సవాల్ తప్పదు. ఆ జట్టులోని ప్రధాన బ్యాటర్లు డేవన్ కాన్వే, టామ్ లేథమ్, కేన్ విలియమ్సన్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ మంచి ఫామ్‌లో ఉన్నారు. తాజాగా పాక్, దక్షిణాఫ్రికాతో జరిగిన ముక్కోణపు సిరీస్‌ను కివీస్ సొంతం చేసుకుంది. ఫైనల్‌లో పాక్‌ను ఓడించింది. అయితే, ప్రధాన పేసర్లు టిమ్ సౌథీ, ట్రెంట్ బౌల్ట్, లాకీ ఫెర్గూసన్ లేకుండానే ఆడనున్న నేపథ్యంలో పేస్ విభాగం కాస్త బలహీనంగానే ఉంది. ఆ జట్టు కెప్టెన్ మిచెల్ సాంట్నర్ నుంచి టీమ్ఇండియాకు ప్రమాదం తప్పదు. గతేడాది భారత్ పిచ్‌లపైనే సాంట్నర్ విజృంభించిన సంగతి తెలిసిందే. ఇక ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర తలకు బలమైన గాయం కారణంగా అతడి రాకపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. కివీస్ బౌలింగ్‌తో పోలిస్తే బ్యాటింగ్ బలంగా ఉంది. ఇది టీమ్ఇండియా బౌలింగ్‌కు పరీక్ష ఎదురుకానుంది.



## ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు మరో వివాదం..

### కనిపించని భారత్ జెండా!

**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్ ఆతిథ్యంలో జరిగే ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీకి అంతా సిద్ధమైంది. ఈ టోర్నీ కోసం దాయాది దేశంలో పర్యటించేది లేదని తేల్చి చెప్పిన నేపథ్యంలో.. టీమ్ఇండియా ఆడే మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్న విషయం తెలిసిందే. ట్రోఫీ ఆరంభానికి ఇంకా రెండు రోజులే సమయమున్న నేపథ్యంలో కరాచీ స్టేడియంలో చోటుచేసుకున్న ఓ ఘటన తాజా వివాదానికి దారితీసింది. ఈ స్టేడియంలో అన్ని జట్ల జాతీయజెండాలను ప్రదర్శించగా.. అందులో భారతదేశ పతాకం లేకపోవడం గమనార్హం. దీనికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే.. ఇది ఎంతవరకు వాస్తవమో తెలియాల్సి ఉంది. మరోవైపు ఇరు జట్ల బోర్డుల నుంచి ఎలాంటి స్పందన లేదు. భారతదేశ జెండా ఆ స్టేడియంలో ప్రదర్శించకపోవడానికి గల కారణాలేంటో తెలియరాలేదు. కరాచీ స్టేడియం వేదికగా.. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, ఇంగ్లండ్ జట్ల మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే.. ఈ టోర్నీలో పాల్గొనే అన్ని దేశాల జెండాలు ప్రదర్శించాల్సినచోట భారత జాతీయజెండా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాక్ క్రికెట్ బోర్డు ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకుందని పలువురు అభిమానులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు పాకిస్థాన్ గడ్డపై ఆడేందుకు విముఖత చూపించినందుకు భారత ఆటగాళ్లను ఎవరూ హగ్ చేసుకోవద్దని తమ క్రికెటర్లను అభిమానులు ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈమేరకు పాక్ జర్నలిస్ట్ ఒకరు తన సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేశారు. పాకిస్థాన్‌లో ఆడేది లేదని టీమ్ఇండియా తేల్చి చెప్పడంతో.. ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌కు మార్చిన విషయం తెలిసిందే. భారత్ ఆడే మ్యాచ్‌లకు దుబాయ్ వేదిక కానుంది. ఒకవేళ భారత్ లీగ్ దశ నుంచి సెమీస్, ఫైనల్‌కు చేరితే.. ఆ మ్యాచ్‌లు కూడా అక్కడే జరగనున్నాయి. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-పాక్ మ్యాచ్ ఈనెల 23న దుబాయ్ వేదికగా జరగనుంది.



## బుమ్రా లేకపోయినా.. ఆ ఆటగాడి నుంచి బంగ్లాకు పెద్ద ముప్పు

### - హెచ్చరించిన మాజీ

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్ ఆడేందుకు టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. దుబాయ్ వేదికగా జరిగే ఈ మ్యాచ్ కోసం అటు బంగ్లా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే దుబాయ్ చేరుకున్న టీమ్ఇండియా ప్రాక్టీస్‌పై దృష్టిపెట్టింది. ఈ మ్యాచ్‌పై బంగ్లా మాజీ ఓపెనర్ ఇమ్రుల్ కయేస్ స్పందించాడు. స్టార్ పేసర్ బుమ్రా టీమ్ఇండియా జట్టులో లేకపోవడాన్ని సద్వినియోగం చేసుకోవాలని బంగ్లా జట్టుకు సూచించాడు. మరోవైపు బుమ్రా లేకపోయినా.. మరో రూపంలో ముప్పు పొంచి ఉందని జట్టును హెచ్చరించాడు. "టీమ్ఇండియా ఎంతో బలమైన జట్టు. దాని బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలు ఎంతో పటిష్ఠంగా ఉన్నాయి. అయితే.. జట్టులో బుమ్రా లేడు. అతడు గత రెండేళ్లలో టీమ్ఇండియాకు ఎంత గొప్ప ప్రదర్శన చేశాడో చూశాం. అతడు లేకపోవడం బంగ్లా జట్టుకు కలిసొచ్చే విషయమే" "బుమ్రా లేకపోయినా.. ఆ జట్టులో మహమ్మద్ షమీ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ ఉన్నారు. షమీ జట్టులోకి రావడం పెద్ద పరిణామం. అతడు ప్రస్తుతం ఫిట్‌నెస్‌తో కాస్త ఇబ్బంది పడుతున్నాడు. అయితే.. ఒక్కసారి బంతితో లయను అందుకుంటే, అతడు బంగ్లాకు పెద్ద ముప్పుగా మారతాడు" అని జట్టు సభ్యులను ఇమ్రుల్ హెచ్చరించాడు. ఇక బంగ్లా జట్టులో వెటరన్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ లేకపోవడం ఇబ్బందికర విషయమేనని ఇమ్రుల్ అంగీకరించాడు. "షకీబ్ గొప్ప ఆటగాడు. అతడిని మేం మిస్ అవుతున్నాం. ఏ మ్యాచ్‌లోనైనా అతడు ప్రభావం చూపిస్తాడు" అని పేర్కొన్నాడు. దుబాయ్ వేదికగా భారత్-బంగ్లా మధ్య తొలి మ్యాచ్ ఈ నెల 20న జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారతే ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. ఆ తర్వాత చిరకాల ప్రత్యర్థి అయిన పాకిస్థాన్ తో భారత్ 23న తలపడనుంది.

## భారత్-పాక్ మ్యాచ్

### గొప్ప ప్రదర్శన చేసే ఆటగాళ్లు ఎవరంటే..?



**దుబాయి :** ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ఇండియా సిద్ధమవుతోంది. ఇక ఈ మెగా టోర్నీలో భాగంగా చిరకాల ప్రత్యర్థుల మధ్య జరిగే మ్యాచ్ కోసం ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. కేవలం ఐసీసీ టోర్నీల్లోనే తలపడే ఈ రెండు జట్ల మధ్య పోరు ఎంతో రసవత్తరంగా సాగుతుందనడంలో ఏ సందేహం లేదు. ఈనెల 23న దుబాయ్ వేదికగా జరిగే ఈ మ్యాచ్ గురించి పలువురు మాజీలు తమ అంచనాలను ఇప్పటినుంచే వెల్లడిస్తున్నారు. తాజాగా ఇరుజట్లకు చెందిన మాజీలు ఓ క్రికెట్ షోలో పాల్గొని ఈ మ్యాచ్‌పై తమ అభిప్రాయాలు వెల్లడించారు. దాయాదుల మధ్య జరిగే పోరులో గొప్ప ప్రదర్శన చేసే ఆటగాళ్లు ఎవరో టీమ్ఇండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్‌సింగ్, పాక్ మాజీ కెప్టెన్లు ఇంజమామ్, షాహిద్ అఫ్రిదీ అంచనా వేశారు. ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున శుభ్‌మన్ గిల్ అత్యధిక పరుగులు చేస్తాడని.. అటు బంతితో మహమ్మద్ షమీ ఎక్కువ వికెట్లు తీస్తాడని యువీ అభిప్రాయపడ్డాడు. మరోవైపు పాకిస్థాన్ వైపు బ్యాట్‌తో బాబర్ అజామ్.. బంతితో షాహీన్ అఫ్రిదీ ఆకట్టుకుంటారని షాహిద్ అఫ్రిదీ తెలిపాడు. అయితే ఇంజమామ్ మాత్రం.. బాబర్‌తో పాటు హారిస్ రవూఫ్ పేర్లు పేర్కొన్నాడు. మ్యాచ్ విజయంలో కీలకంగా ఏ ఆటగాళ్లు మారుతారన్న ప్రశ్నకు.. టీమ్ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పేరును యువరాజ్ చెప్పాడు. రిజ్వాన్ పేరును అఫ్రిదీ పేర్కొనగా.. ఇంజమామ్.. ఫకర్ జమాన్ పేరు సూచించాడు. ఆదివారం జరిగే ఈ మ్యాచ్‌లో ఏ జట్టు పైచేయి సాధిస్తుంది..? అని అడగ్గా.. దుబాయ్ పరిస్థితుల ప్రకారం దాయాది పాకిస్థాన్ వైపే యువరాజ్ మొగ్గుచూపడం గమనార్హం.

### ఆ లెక్క సరిచేస్తారా..?

ఇక ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో గణాంకాలను పరిశీలిస్తే.. ఇరు జట్లు ఇప్పటివరకూ ఐదుసార్లు తలపడ్డాయి. వీటిల్లో మూడు మ్యాచ్‌ల్లో పాకిస్థాన్ విజయం సాధిస్తే.. మరో రెండింట్లో భారత్ గెలుపొందింది. తాజాగా దుబాయ్ వేదికగా జరిగే మ్యాచ్‌లో రోహిత్ సేన విజయం సాధించి ఈ లెక్కను సరి చేయాలని భావిస్తోంది. ఛాంపియన్స్ ట్రోఫీ ఈనెల 19 నుంచి ప్రారంభం కానుండగా.. తదుపరి రోజు టీమ్ఇండియా తన తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. 23న పాకిస్థాన్‌తో మ్యాచ్ ఉండనుంది.

## అలా కొడితే బౌండరీయే అన్న రోహిత్..

### 'క్యా షాట్ హై' అని మెచ్చుకున్న పంత్



**దుబాయి :** ఇంగ్లండ్‌ను వన్డే సిరీస్‌లో వైట్ వాష్ చేసి టీమ్ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ లోకి మరింత ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టింది. గత శనివారం దుబాయ్‌కు భారత జట్టు చేరుకుంది. బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఆటగాళ్లు నెట్స్‌లో తీవ్రంగా సాధన చేస్తున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, షమీ తదితరులు ప్రాక్టీస్ చేశారు. ఈ సమయంలో ఆటగాళ్లు, కోచింగ్ స్టాఫ్ ఎంతో ఉత్సాహంగా కనిపించారు. మధ్య మధ్యలో ఆటగాళ్లు జోకులు వేసుకుంటూ సరదా సంభా షణలు కొనసాగించారు. 'అంచనా వేసి బంతిని ఆడండి.. కవర్ ఫీల్డర్‌ను అధిగమిస్తే అది బౌండరీయే' అని రోహిత్ శర్మ అనగా కెమెరాలు అతడివైపు తిరిగాయి. ఆ తర్వాత హార్దిక్.. రవీంద్ర జడేజాతో గుజరాతీలో ఏదో మాట్లాడుతూ కనిపించాడు. అనం తరం రోహిత్ టెన్నిస్ బాల్‌తో క్యాచ్‌ల ప్రాక్టీస్ సెషన్ నిర్వహి ంచగా.. ఆటగాళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన హార్దిక్ పాండ్య తనలో తాను మాట్లాడుకోవడం నవ్వులు తెప్పించింది. బంతిని అంచనా వేయడంలో తప్పు చేసినట్లు గ్రహించిన హార్దిక్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. "బంతి బ్యాట్ బాటమ్ పార్ట్‌ను తాకింది. కొట్టాలనుకుంటే కొట్టు" అని తనలో తాను మాట్లాడుకు న్నాడు. ఇక గిల్ పక్కనే బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన కోహ్లీ.. 'ఆటను ఎంజాయ్ చేయ్' అని అన్నాడు. మరోవైపు వాషింగ్టన్ సుందర్‌కు సలహాలు ఇస్తూ హార్దిక్ కనిపించాడు. ఆ తర్వాత కెమెరాలు 'షాట్ ఆఫ్ ది డే'ను క్యాప్చర్ చేశాయి. అది కొట్టింది ఎవరో కాదు.. హర్షిత్ రాణా. బంతి చాలా దూరం వెళ్లడంతో.. రిషభ్ పంత్ 'క్యా షాట్ హై' అంటూ ప్రశంసించాడు. అయితే.. బ్యాటింగ్ కోచ్ నాయర్ మాత్రం కాస్త దూకుడు తగ్గించాలని రాణాకు సూచించాడు.

## హార్దిక్.. బుమ్రా టాలెంట్‌ను అప్పుడలా గుర్తించాం : నీతా అంబానీ



**ముంబై:** ముంబయి ఇండియన్స్ జట్టులో అద్భుతమైన టాలెంటెడ్ ప్లేయర్లు ఉన్నారు. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్.. ఇలా చెబుతూపోతే పెద్ద లిస్టే ఉంది. హార్దిక్, బుమ్రా వంటి నాణ్యమైన ప్లేయర్లను తాము ఎలా గుర్తించా మనే విషయాన్ని రిలయన్స్ ఫౌండేషన్ ఫౌండర్, ఛైర్‌పర్సన్ నీతా అంబానీ వెల్లడిం చారు. బోస్టన్ వేదికగా జరిగిన ఓ కార్యక్ర మంలో నీతా అంబానీ మాట్లాడారు. "ఐపీఎల్‌లో మాకు ఫిక్స్‌డ్ బడ్జెట్ ఉంటుంది. ప్రతి జట్టూ ఆ మొత్తాన్ని వెచ్చించాలి. దీంతో టాలెంటెడ్ క్రికెటర్లను గుర్తించేందుకు చాలా మార్గాలను అన్వేషించాం. ప్రతి రంజీ మ్యాచ్‌కు వెళ్లడం నాకు ఇప్పటికీ గుర్తుంది. దేశవాళీ మ్యాచ్‌లను వీక్షించడం వల్ల నాణ్య మైన క్రికెటర్లను తెలుసుకోవడం సులువుతుం దని మా బృందం అర్థం చేసుకుంది. ఇలా ఓ రోజు మా బృందం ఇద్దరు కుర్రాళ్లను ఎంపిక చేసి క్యాంప్‌నకు తీసుకొచ్చింది. అప్పటికి వారిద్దరూ చాలా బక్కపలచగా ఉన్నారు. వారిద్దరితో నేను మాట్లాడా. గత మూడేళ్ల నుంచి కేవలం మ్యాగీ, నూడుల్స్ మాత్రమే తినేవాళ్లమని చెప్పారు. ఎందుకు అని అడిగితే.. తమవద్ద తగినంత డబ్బులు లేవనేది వారి సమాధానం. అలాంటి పరిస్థితుల్లోనూ వారిలో నేను ఆటపట్ల నిబద్ధత, ఉత్సాహం, అభిరుచిని గమనించా. ఆ ఇద్దరే ప్రస్తుతం ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్య, కృనాల్ పాండ్య సోదరులు. ఇదంతా 2015లో జరిగింది. పాండ్యను తొలిసారి 10వేల యూఎస్ డాలర్లకు వేలంలో తీసుకున్నాం. ఇప్పుడు అతడు మా సారథి. ఇక ఆ మరుసటి ఏడాదే మా అన్వేషణ బృందం మరో ఆటగాడిని క్యాంప్‌లో చేర్చారు. అతడి బౌలింగ్‌ను చూసి తీసుకొచ్చామని చెప్పారు. బాడీ లాంగ్వేజ్ కూడా విభిన్నంగా ఉంది. అతడు బంతితో మాట్లాడతాడని మేం గమనించాం. ఆ పేసర్ మరెవరో కాదు జస్‌ప్రీత్ బుమ్రా. అతడి గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గత సంవత్సరం మేం తిలక్‌వర్మను పరిచయం చేశాం. టీమ్ఇండియాలో అత్యంత కీలకమైన ప్లేయర్‌గా మారుతున్నాడు. అందుకే ముంబయి ఇండియన్స్ భారత క్రికెట్ జట్టుకు నర్సరీలాంటిది. అద్భుతమైన ఆటగాళ్లను అందిస్తూ ఉంటుంది" అని నీతా అంబానీ వెల్లడించారు.


## వ్యక్తిగత చెఫ్ లేడు.. డైట్ ఫుడ్ కోసం కోహ్లీ ఏం చేశాడంటే?



**దుబాయి :** ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ఇండియా ఇప్పటికే దుబాయ్‌కు చేరుకుంది. ప్రాక్టీస్ కూడా ముమ్మరం చేసింది. విరాట్, రోహిత్‌తోపాటు ఇతర క్రికెటర్లూ నెట్స్‌లో ఎక్కువగా సాధన చేశారు. బీసీసీఐ పది ఆదేశాల మేరకు ఆటగాళ్ల కుటుంబ సభ్యులకు అనుమతి ఇవ్వలేదు. అలాగే వ్యక్తిగత చెఫ్‌నూ పెట్టుకొనేందుకు వీల్లేకుండా పోయింది. జట్టుకు బోర్డు నుంచి ప్రత్యేకంగా ఓ చెఫ్‌ను కేటాయించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, డైట్ విషయంలో కఠినంగా ఉండే భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తనకిష్టమైన ఆహారం కోసం ఓ మార్గం కనిపెట్టినట్లు తెలుస్తోంది. ఆదివారం ప్రాక్టీస్‌కు వచ్చిన కాసేపటికే.. వేదిక వద్దకు కోహ్లీకి ఫుడ్ డెలివరీ అయింది. ప్యాకెట్ల రూపంలో ఉన్నవి బ్యాటర్‌కు అందాయి. ప్రత్యేకంగా చెఫ్ లేకపోవడంతో లోకల్ టీమ్ మేనేజర్‌కు చెప్పి తనకు కావాల్సిన వాటిని తెప్పించుకున్నాడు. ఎలా చేయాలి? ఎలా ఉండాలనే దాని గురించి పూర్తిగా వివరించినట్లు సమాచారం. దీంతో సదరు మేనేజర్ వెంటనే ప్రసిద్ధిగాంచిన ఫుడ్ పాయింట్ నుంచి ప్యాకెట్లను తెచ్చి కోహ్లీకి అందించాడు. "ప్రాక్టీస్ సెషన్ అనంతరం కోహ్లీ తినేందుకు కొన్ని ఆహార పొట్లాలను ఇచ్చారు. ఇతర క్రికెటర్లు తమ కిట్‌లను సర్దుకుంటూ ఉండగానే.. కోహ్లీ మాత్రం అక్కడే తన భోజనం పూర్తి చేశాడు. ప్రయాణంలోనూ తినేందుకు మరికొన్ని బాక్స్‌లను దాచుకున్నాడు" అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

# రాజమౌళి సినిమాలకు లాజిక్ అవసరం లేదు : కరణ్ జోహార్





గొప్ప సినిమాలకు లాజిక్‌తో అవసరం లేదని బాలీవుడ్ ప్రముఖ నిర్మాత, దర్శకుడు కరణ్ జోహార్ అన్నారు. దర్శకుడికి తన కథపై నమ్మకం ఉంటే సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందన్నారు. అగ్ర హీరోల సినిమాలకు దర్శకత్వం వహించిన కరణ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా విజయంపై తన అభిప్రాయాలను వివరించారు. రాజమౌళి, సందీప్ వంగా, అనిల్ శర్మల చిత్రాల గురించి ప్రస్తావించారు. "కొన్ని సినిమాలు లాజిక్ కంటే నమ్మకం ఆధారంగా హిట్ అవుతాయి. గొప్ప దర్శకుల సినిమాల్లో ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. సినిమాపై నమ్మకం ఉంటే ప్రేక్షకులు లాజిక్ గురించి పట్టించుకోరని వారు నిరూపించారు. ఉదాహరణకు రాజమౌళి సినిమాలను పరిశీలిస్తే.. ఆయన చిత్రాల్లో లాజిక్‌ల గురించి ప్రేక్షకులు ఎప్పుడూ మాట్లాడరు. ఆయనకు తన కథపై పూర్తి నమ్మకం ఉంటుంది. ఎలాంటి సన్నివేశాన్నైనా ప్రేక్షకులకు నమ్మకం కలిగేలా తెరకెక్కించగలరు. ఆర్ఆర్ఆర్, యానిమల్, గదర్ ఇలాంటివాటికి కూడా ఇదే వర్తిస్తుంది. వీటి హిట్‌కు ఆయా దర్శకులపై ఉన్న నమ్మకం కూడా ఒక కారణం. ఒక వ్యక్తి హ్యాండ్ పంప్‌తో 1000 మందిని కొడుతున్నట్లు చూపించినా అది సాధ్యమా, కాదా అని ఎవరూ చూడరు. సన్నీ దేవోల్ ఏదైనా చేయగలడని దర్శకుడు అనిల్‌శర్మ నమ్మారు. దాన్నే తెరపై చూపించారు. దీంతో ప్రేక్షకులు కూడా నమ్మారు. ఫలితంగా 'గదర్ 2' బ్లాక్‌బస్టర్ హిట్ అయ్యింది. సినిమా విజయం పూర్తిగా విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. లాజిక్‌ల గురించి ఆలోచించడం వల్ల ఉపయోగం ఉండదు. సినిమాను వినోదం కోసం మాత్రమే చూడాలి" అని కరణ్ అన్నారు.

# అలియా ఘనత..

## అత్యంత ప్రభావవంతమైన నటిగా గుర్తింపు



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలి యాభట్ మరోసారి ఘనతను సాధించారు. ఇన్‌స్టాలో ప్రపంచవ్యా ప్తంగా అత్యంత ప్రభావవంతమైన నటీమణుల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. ఇన్‌ఫ్లుయె న్సర్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్ హైప్ ఆడిటర్ తాజాగా విడుదల చేసిన నివేదికలో అలియా రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జెన్నిఫర్ లోపెజ్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలను వెనక్కినెట్టి అలియా టాప్‌లో ఉండడం విశేషం. దీంతో అలియా సినీరంగంలో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు చెబుతున్నారు. సోషల్ మీడియాలో ఈ స్టార్ హీరోయిన్‌కు ఉన్న ఫాలోయింగ్ తెలిసిందే. ఇన్‌స్టాలో ఈ బ్యూటీని ఏకంగా 8 కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారు. ఎప్పుడూ తన సినిమా విశేషాలతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా అలియా అభిమానులతో పంచుకుంటుంటారు. ఫొటోషూట్‌లతో నిత్యం ఆకట్టుకుంటుంటారు. ఇక అలియా గతేడాది కూడా టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన '100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఆఫ్ 2024' (ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు) జాబితాలో చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. చివరిసారి 'జిగ్రా'తో అలియా పలకరించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రం మిశ్రమ ఫలితాలకు పరిమితమైంది. కొన్ని రోజులుగా ఈమెకు సంబంధించిన పలు వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్- హనురాఘవపూడి కాంబినేషన్‌లో రానున్న సినిమాలో అలియా యువరాణి పాత్రలో మెరవనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే టాలెంటెడ్ దర్శకుడు నాగ్ అశ్విన్ సినిమాలోనూ ఆమె నటించనున్న ట్లు వార్తలు వస్తున్నాయి.

# భాగ్యశ్రీ బోర్సేకి మరో బంపర్ ఆఫర్..

## స్టార్ హీరో సరసన ఛాన్స్!



'మిస్టర్ బచ్చన్'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి తన డ్యాన్స్‌తో ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఆ సినిమా తర్వాత ఈ బ్యూటీ వరుస ఆఫర్లు అందుకుంటూ అలరించేందుకు సిద్ధమయ్యారు. తాజాగా భాగ్యశ్రీ ఓ బంపర్ ఆఫర్ అందుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమిళ స్టార్ హీరో సూర్య సరసన ఓ సినిమాలో నటించనున్నట్లు కోలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా రానున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా భాగ్యశ్రీని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఆమెతో చర్చలు జరిపారని ఈ ప్రాజెక్ట్‌కు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఈ ఏడాది మే నెలలో దీని షూటింగ్ ప్రారంభించనున్నారట. సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఈ సినిమా రానుందని జీవీ ప్రకాశ్ దీనికి సంగీతం అందించనున్నట్లు సినీ వర్గాల సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే రానున్నరోజుల్లో భాగ్యశ్రీ బిజీ హీరోయిన్‌గా మారడం ఖాయమంటున్నారు అభిమానులు. ఇప్పటికే భాగ్యశ్రీ చేతిలో వరుస సినిమాలు ఉన్నాయి. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'కాంత'. ఇందులో దుల్కర్ సరసన భాగ్యశ్రీ కనిపించనున్నారు. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్ఘీస్ నిర్మాతలు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. మహేశ్ దర్శకత్వంలో యంగ్ హీరో రామ్ పోతినేని నటిస్తున్న చిత్రంలోనూ భాగ్యశ్రీ నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. వీటితో పాటు విజయ్ దేవరకొండ- గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో రానున్న 'కింగ్‌డమ్'లో ఈమెను ఎంపిక చేసినట్లు సమాచారం.

# తెలుగు సినిమా సెట్‌లో ఎగతాళి..

## ఎంతో బాధపడ్డా : శ్వేతాబసు ప్రసాద్



'కొత్తబంగారు లోకం' సినిమాతో కుర్రకారును మైమరపించేసి వారి హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నారు నటి శ్వేతాబసు ప్రసాద్. కొన్నేళ్లుగా ఆమె టాలీవుడ్‌కు దూరంగా ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన కెరీర్ గురించి మాట్లాడారు. ఓ తెలుగు సినిమా సెట్‌లో తాను అవమానాలు ఎదుర్కొన్నానని అన్నారు. సెట్‌లో ఉన్న ప్రతిఒక్కరూ శరీరాకృతి విషయంలో తనని ఎగతాళి చేశారని చెప్పారు. ఆ సమయంలో తాను ఎంతో బాధపడ్డానని చెప్పారు. "కెరీర్ విషయంలో నేను సంతృప్తిగానే ఉన్నా. నాకు నచ్చిన సినిమాలు చేశాను. ప్రస్తుతం టెలివిజన్ ఇండస్ట్రీలో రాణిస్తున్నాను. కెరీర్ పరంగా ఇబ్బందిపడిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా ఒక తెలుగు సినిమా సెట్‌లో చాలా ఇబ్బందిపడ్డా. హీరోతో పోలిస్తే నేను ఎత్తు తక్కువగా ఉన్నానని సెట్‌లో ఉన్న ప్రతిఒక్కరూ నన్ను ఎగతాళి చేసేవారు. హీరో ఆరడుగులు ఉంటే ఈవిడేమో 5 అడుగులు ఉందని అనేవారు. ఇక, హీరోతో వచ్చిన సమస్య మరో స్థాయిలో ఉండేది. అతను ప్రతి సన్నివేశాన్ని మార్చేస్తుండేవాడు. గందరగోళానికి గురి చేసేవాడు. రీటేక్స్ ఎక్కువగా తీసుకునేవాడు. తెలుగులో డైలాగ్స్ చెప్పలేకపోయేవాడు. నిజం చెప్పాలంటే నాక్కూడా తెలుగు సరిగ్గా రాదు. కానీ, నేను ఏదోఒకరకంగా డైలాగ్స్ నేర్చుకొని షూట్‌లో నెట్టుకొచ్చేదాన్ని. అతను మాత్రం అలా కాదు. మాతృభాష తెలుగే అయినప్పటికీ అతనికి భాషపై కంట్రోల్ లేదు కానీ, నన్ను మాత్రం నా కంట్రోల్‌లో లేని నా ఎత్తు గురించి కామెంట్ చేసేవాడు. ఎత్తు అనేది వారసత్వంగా వస్తుంది కదా. దానికి నేనేం చేసేది. నాకు తెలిసి నేను అంత బాధపడిన సెట్ ఏదైనా ఉందంటే అదే" అని శ్వేతా బసు ప్రసాద్ అన్నారు. 11 ఏళ్ల వయసుకే బాలనటిగా కెరీర్ ఆరంభించారు నటి శ్వేతా బసు ప్రసాద్. 'మక్డి' అనే మూవీలో ఆమె నటించారు. 2008లో తెరకెక్కిన 'కొత్తబంగారు లోకం'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా విజయం తర్వాత 'రైడ్', 'కాస్కో', 'కళవర్ కింగ్', 'ప్రియుడు', 'జీనియస్' వంటి చిత్రాల్లో యాక్ట్ చేశారు. 2018లో విడుదలైన 'విజేత' తర్వాత ఆమె తెలుగు సినిమాల్లో యాక్ట్ చేసిన సందర్భాల్లేవు. ప్రస్తుతం హిందీ సినిమాలు, సీరియల్స్‌లో ఆమె నటిస్తున్నారు.



# ఆ ఆరోపణల్లో నిజం లేదు..

## మేము నిజమే చెప్పాం : దర్శకుడు

**ముంబయి:** అక్షయ్‌కుమార్, వీర్ పహారియా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్కై ఫోర్స్'. ఈ సినిమా కలెక్షన్స్‌పై వస్తోన్న ఆరోపణలపై దర్శకుడు సందీప్ కేవ్లానీ స్పందించారు. ఆ వార్తల్లో నిజం లేదని అన్నారు. "కలెక్షన్స్ విషయంలో మేము తప్పుడు సమాచారం ఇస్తున్నామని పలువురు వ్యాఖ్యలు చేస్తున్నారు. అందులో నిజం లేదు. ఫేక్ పోస్టర్లు వేస్తున్నామని అంటున్నారు. ఇలాంటి వార్తలు సృష్టిస్తే వారికి వచ్చే లాభాలు ఏమిటో నాకు అర్థం కావడం లేదు. ఒకవేళ వాళ్లు ఇలాగే మాట్లాడాలనుకుంటే.. గడిచిన ఐదేళ్లలో వచ్చిన సినిమాలన్నింటి కలెక్షన్స్ గురించి మాట్లాడాల్సి ఉంటుంది. బ్లాక్ బుకింగ్స్ చేశామని అందుకే ఇన్ని వసూళ్లు వచ్చాయని ఎలా అంటారు? మేము అలాంటి పనులకు పాల్పడలేదు. అవి నిజమైన వసూళ్లు. ప్రేక్షకుల ప్రేమకు అది నిదర్శనం. మా సినిమా విడుదలై 20 రోజులు అవుతున్నా సోషల్‌మీడియాలో ప్రేక్షకులు వరుస సందేశాలు పెడుతున్నారు. మా చిత్రాన్ని వారెంతగా ఆదరిస్తున్నారో చెప్పడానికి అదే నిదర్శనం. నిజం చెప్పాలంటే, సినిమా విడుదలైన కొన్ని రోజుల పాటే కలెక్షన్స్ గురించి మాట్లాడతారు. ఆ తర్వాత వారికి గుర్తుండేది సినిమా కథ మాత్రమే" అని ఆయన అన్నారు. 1965లో జరిగిన భారత్ – పాకిస్థాన్ వైమానిక యుద్ధం నేపథ్యంలో రూపొందిన చిత్రమే 'స్కై ఫోర్స్'. రిపబ్లిక్ డే స్పెషల్‌గా జనవరి 24న ఇది విడుదలైంది. అక్షయ్‌కుమార్ నటనను సినీప్రియులు మెచ్చుకున్నారు. వీర్ పహారియా, సారా అలీఖాన్ జోడీ కన్నీళ్లు పెట్టించారని అన్నారు. సుమారు రూ.100 కోట్లకు పైగా ఇది వసూలు చేసినట్లు అంచనా.

# ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నా : సాయిపల్లవి

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని కోరికను బయటపెట్టేసింది సహజనటి సాయిపల్లవి. ఆమెకు జాతీయ అవార్డు అందుకోవాలని ఎంతో ఆశగా ఉందట. దానికి బలమైన కారణం కూడా ఉందట. ఆ విషయం గురించి ఆమె మాట్లాడుతూ 'పెళ్లప్పుడు కట్టుకోమని మా మామ్మ నాకు ఓ చీర ఇచ్చింది. అప్పుడు నాకు 21ఏళ్లు. అప్పటికింకా నేను సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వలేదు. అసలు ఆ ఆలోచనే లేదు. పెళ్లి చేసుకునేటప్పుడు కట్టుకుందామని ఆ చీర దాచుకున్నాను. కొనేళ్లకు అనుకోకుండా 'ప్రేమమ్'తో నటిని అయ్యాను. 'ఫిదా'తో మంచి పేరొచ్చింది. ఏదో ఒక రోజు తప్పకుండా ఒక ప్రతిష్టాత్మక అవార్డు కూడా అందుకుంటాననే నమ్మకం వచ్చింది. అందుకే.. జాతీయ అవార్డు అనేది నిజంగా నాకొస్తే.. అప్పుడు మా మామ్మ ఇచ్చిన చీర కట్టుకొని ఆ అవార్డు అందుకోవాలి అని నిశ్చయించుకున్నా. నిజంగా అవార్డు వచ్చినా, రాకపోయినా.. ఆ చీర ధరించే వరకూ ఆ ఒత్తిడి మాత్రం నన్ను వదలదు.' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి. నిజానిక్కూడా ఈ దఫా సాయిపల్లవికి నేషనల్ అవార్డు పక్కా అని పలువురి అభిప్రాయం. 'అమరన్'లోని ఆమె నటనకు తప్పకుండా అవార్డు వస్తుందని చాలామంది నమ్ముతున్నారు. అదే జరిగితే సాయిపల్లవి ఒత్తిడి తీరుతుంది. అభిమానుల ఆకాంక్షా నెరవేరుతుంది.



# రెడ్ చీరలో అదరగొడుతున్న దేత్తడి హారిక..



దేత్తడి హారిక.. ఈ చిన్నదాని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. యూట్యూబ్ స్టార్ గా తెలుగు రాష్ట్రాల్లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. తెలంగాణ యాసలో మాట్లాడుతూ.. యూట్యూబ్ లో అందరికీ ఇచ్చిపడేసే వీడియోలతో నెట్టింట బాగా పాపులర్ దేత్తడి హారిక. సోషల్ మీడియా ద్వారా వచ్చిన క్రేజ్ తో ఈ చిన్నది బిగ్ బాస్ గేమ్ షోలో అవకాశం అందుకుంది. నాగార్జున హోస్ట్ గా చేసిన బిగ్ బాస్ సీజన్ 4లో కంటెస్టెంట్ గా పాల్గొంది. హౌజ్‌లో తనదైన అల్లరి పనులతో టాప్ 5లో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా తన ఇంస్టాగ్రామ్ అకౌంటులో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది ఈ భామ. 9 సెప్టెంబర్ 1997న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఓ హిందూ కుటుంబంలో జన్మించింది అందాల తార అలేఖ్య హారిక. ఈ బ్యూటీకి వంశీ కార్తీక్ అనే ఒక సోదరుడు కూడా ఉన్నాడు. సోషల్ మీడియాలో ఈ చిన్నదాన్ని ఫాలో అయ్యేవారి సంఖ్య ఎక్కువే.. హైదరాబాద్ లోని ఓ పాఠశాలలో స్కూలింగ్ విద్య పూర్తిచేసింది. మెహదీపట్నంలో ఉన్నసెయింట్ ఆన్స్ కళాశాల నుంచి బ్యాచలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి డిగ్రీ పట్టా పొందింది ఈ వయ్యారి భామ. అలేఖ్యకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్‌పై మక్కువ ఎక్కువ. చిన్నప్పటి నుంచి కొరియోగ్రాఫర్ కావాలని కోరిక. 2015లో ఆమె హైదరాబాద్‌లోని అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఎగ్జిక్యూటివ్‌గా చేరారు. అలేఖ్య దాదాపు మూడు సంవత్సరాలు అక్కడ పని చేసింది. ఆతర్వాత సోషల్ మీడియాలో పాపులర్ అయ్యింది. కొన్ని సినిమాల్లోనూ నటించింది. అలాగే ప్రైవేట్ ఆల్బమ్స్ లోనూ నటించింది దేత్తడి హారిక.


Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**